

14లోగా ఓటుకు దరఖాస్తు చేసుకోండి



పుట్టపర్తి, ఏప్రిల్ 1: యవతీయువకులు ఈనెల 14వ తేదీలోగా ఓటుహక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలంటూ జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు సోమవారం ప్రకటనలో తెలిపారు. సార్వత్రిక ఎన్నికల్లో అర్హులందరూ ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. సోమవారం నాటికి 18 సంవత్సరాలు నిండిన వారు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.

తుస్సుమన్న జగన్ బస్సుయాత్ర

- జనంలేక వెలవెల
- మాటల్లేకుండానే ముందుకు కదిలిన సీఎం
- జాతీయ రహదారిపై గంటల తరబడి ట్రాఫిక్ జామ్
- ప్రయాణికులు, వాహనదారులకు తప్పని తిప్పలు
- అడ్డు వస్తాయని పచ్చని చెట్టు కొమ్మల నరికివేత
- విద్యుత్ వైర్లూ తొలగించిన వైనం
- రోజంతా కరెంటు లేక ఉక్కపోతతో జనం విలవిల
- పనిలేక షాపులూ బంద్

జగన్ బస్సుయాత్రకు అడ్డుగా వెళ్తున్న గోపాలమిత్రులు



అన్నొచ్చాడు.. నరకం చూపించాడు..!

ధర్మవరం/కదిరి/బత్తలపల్లి, ఏప్రిల్ 1: ముఖ్యమంత్రి వైఎస్ జగనన్న జిల్లాకొచ్చాడు.. జనాలకు నరకం చూపించాడు. ఎండాకాలంలో చెట్టు నీడ ఎంతో అవసరం. అలాంటి చెట్లకొమ్మలు జగన్ బస్సుకు అడ్డమవుతాయని అడ్డంగా నరికేశారు. అనంతపురం-చెన్నై రహదారి నిత్యం రద్దీగా ఉంటుంది. భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. అలాంటి వాహనాలకే అడ్డంకాని చెట్టుకొమ్మలు జగన్ బస్సుకు అడ్డమవుతాయట. ఎండలు మండిపోతున్నాయి. ఈ సమయంలో తప్పనిసరి అయితే తప్ప.. ఎవ్వరూ ప్రయాణం చేయరు. అలా ప్రయాణం చేపట్టిన వారికి నరకం చూపించారు. జగన్ బస్సుయాత్ర సాగుతుండడంతో రహదారి పొడవునా ట్రాఫిక్‌ను అడ్డుకున్నారు. దీంతో గంటల తరబడి వాహనాలు ఆగిపోయాయి. ప్రయాణికులు, వాహనదారులు మండుటెండలో ఉక్కపోతతో విలవిల్లాడారు. బస్సుయాత్రకు అడ్డం వస్తాయన్న సాకుతో ఏకంగా విద్యుత్ లైన్లను సైతం తొలగించారు. దీంతో విద్యుత్ సరఫరా ఆగిపోయింది. ఉదయం నుంచి రాత్రి వరకు కరెంటు లేక ఉక్కపోతతో జనం విలవిల్లాడారు. వారి అవస్థలు వర్ణనాతీతం.



ముదిగుబ్బ మండలం ఎన్ఎస్పీ కొట్టాల వద్ద బస్సుయాత్రలో కరువైన జనం

నిరసన సెగ

మేమంతా సిద్ధం పేరుతో చేపట్టిన బస్సుయాత్ర 5వరోజు సోమవారం జనంలేక వెలవెలబోయింది. అధికార పార్టీ నాయకులు అన్ని అస్త్రాలు ప్రయోగించినా వారు ఆశించినస్థాయిలో జనాలు రాకపోవడం ఆ పార్టీ నాయకులను నిరుత్సాహ పరిచింది. బత్తలపల్లి మండలం రాఘవంపల్లి క్రాస్ నుంచి 10 గంటలకు యాత్ర ప్రారంభమైంది. బస్సులో నుంచి సీఎం జగన్ జనాలకు అభివాదం చేస్తూ కదిలారు. అక్కడక్కడ మధ్యలో బస్సు దిగి పలువురిని పలకరిస్తూ ముందుకు సాగారు. బత్తలపల్లికి చేరుగానే బస్సుపైకి ఎక్కి ప్రజలకు అభివాదం చేశారు. మాట మాట్లాడిన పాపానపోలేదు. బత్తలపల్లి దాటగానే గంటాపురం క్రాస్ సమీపంలోని పెట్రోల్ బంక్ వద్ద గోపాలమిత్రలు తమకు ఉద్యోగభద్రత కల్పించాలని ఫ్లెక్సీ ప్లకార్డులు చేతపట్టుకుని సీఎం బస్సును ఆపేందుకు వెళ్లారు. అక్కడున్న భద్రతా సిబ్బంది వారిని అడ్డుకున్నారు. బస్సుయాత్ర అలానే ముందుకు కదలడంతో గోపాలమిత్రలు పరుగెత్తుకుంటూ వెళ్లారు. దీంతో చేసేదిలేక సీఎం జగన్ బస్సు దిగి సమస్య ఏమిటని గోపాలమిత్రలను అడిగి తెలుసుకున్నారు. ఉద్యోగ భద్రత కల్పించాలని వారు కోరు. పార్టీ మళ్లీ అధికారంలోకి వస్తే సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని సీఎం చెప్పారు. ముదిగుబ్బ మండలంలో బస్సు యాత్రకు వైసీపీ నాయకులు ఆశించినం జనం రాకపోవడంతో నిరుత్సాహ పడినట్లు పలువురు పేర్కొంటున్నారు. ఉదయం 11 గంటలకే ముదిగుబ్బకు వస్తాడని జనం ఎదురుచూశారు. మధ్యాహ్నం 2 గంటలకు సీఎం జగన్ ముదిగుబ్బకు చేరుకున్నారు. అంతవరకు జనం ఎండలో ఉక్కపోతతో ఇబ్బందులు పడ్డారు. జగన్ వస్తున్నారని ముదిగుబ్బలో రోడ్డుకిరువైపులా ఉన్న తోపుడుబండ్లను తీసివేయాలని ముందే పోలీసులు హెచ్చరికలుజారీ చేసినట్లు సమాచారం.



బత్తలపల్లిలో జనంలేక వెలవెలబోతున్న జగన్ బస్సుయాత్ర



ఎక్స్‌కవేటర్‌తో చెట్టు కొమ్మలను కొట్టేస్తున్న సిబ్బంది


చెట్టుకొమ్మలు కొట్టేశారు..

కదిరి: జగన్ వస్తున్నాడని పచ్చని చెట్టు కొమ్మలను కొట్టేశారు. బస్సుయాత్రకు అడ్డు అని చెప్పి కదిరి పట్టణ పరిధి కుటాగుళ్ల గేటువద్ద ఉన్న పెద్ద పెద్ద చెట్టు కొమ్మలను కొట్టేశారు. ముఖ్యమంత్రి జగన్ ఎక్కడికెళ్లినా చెట్లను కొట్టేయడం ఆనవాయితీగా మారింది. ఎన్నికల కోడ్ వచ్చినా, అధికారులు మాత్రం చెట్టు కొట్టే సంస్కృతిని వదలలేదు. దాదాపు పది పెద్ద పెద్ద చెట్ల కొమ్మలను తొలగించారు. జగన్ బస్సు వెళ్లడానికి అడ్డం వస్తున్నాయని తొలగించారు. ఇతర బస్సులు మాత్రం యధాతథంగా వెళ్తున్నాయి. పట్టణంలో పలుచోట్ల వైర్లను కూడా తొలగించారు. ఉదయం నుంచి అధికారులు చెట్లు తొలగించే పనిలో నిమగ్నమయ్యారు. ప్రజలు మాత్రం పచ్చని చెట్లు వారికి ఏమి హాని చేశాయని మండిపడుతున్నారు.



కుటాగుళ్ల వద్ద పచ్చని చెట్టు కొమ్మలను కొట్టేసిన దృశ్యం

ఎమ్మెల్యే సిద్దారెడ్డికి అవమానం



కదిరి ఎమ్మెల్యే సిద్దారెడ్డికి ఘోర అవమానం జరిగింది. అధికార పార్టీ ఎమ్మెల్యే అయినా.. మేమంతా సిద్ధం సభకు ఆయనకు ఆహ్వానం అందలేదని ఆయన వర్గీయులు చెబుతున్నారు. ఇది ఘోర అవమానమని వారు మండిపడుతున్నారు. ఆహ్వానం కోసం ఆదివారం సాయంత్రందాకా వేచి చూసినట్లు సమాచారం. ఆహ్వానం అందకపోవడంతో అవమానంగా భావించిన ఎమ్మెల్యే సభకు దూరంగా ఉన్నట్లు తెలిసింది. ఆది నుంచి ఎమ్మెల్యేకి అవమానాలే ఎదురవుతున్నాయి. సమన్వయకర్తగా మగ్బూల్ అహ్మద్‌ను ఎంపిక చేసినప్పటి నుంచి వైసీపీ రెండు వర్గాలుగా చీలిపోయింది. మగ్బూల్ అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకిస్తూ ఎమ్మెల్యే వర్గీయులు పలువురు పదవులకు రాజీనామా చేశారు. అప్పటినుంచి ఇరువర్గాల మధ్య సయోధ్య కుదరలేదు. పార్టీ కార్యక్రమాలకు ఎమ్మెల్యే దూరంగా ఉంటున్నారు. తనను కాదని మగ్బూల్‌ను ఎంపిక చేయడమే దీనికికారణమని ఆయన వర్గీయులు అంటున్నారు. కనీసం మాటమాత్రమైనా చర్చించకుండా మరో వ్యక్తిని తెరపైకి తీసుకువచ్చారని ఆయన వారు మండిపడుతున్నారు. జగన్ సభకు ఆహ్వానించకపోవడంతో ఎమ్మెల్యే మనస్తాపం చెందినట్లు తెలిసింది.



ముదిగుబ్బలో కరెంటు లేకపోవడంతో పనులు లేక ఖాళీగా కూర్చున్న వెల్డింగ్ షాపు నిర్వాహకులు

విద్యుత్ సరఫరా బంద్

సీఎం జగన్ బస్సుయాత్రకు విద్యుత్ తీగలు అడ్డు అంటూ ముదిగుబ్బ మండలంలో ఉదయం తొలగించారు. దీంతో మండలంలోని రాళ్లఅనంతపురం, ముదిగుబ్బ, మలకవేముల సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ సరఫరా ఆగిపోయింది. ఉదయం 7 నుంచి రాత్రయినా విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. రోజంతా కరెంటు లేక జనం ఇబ్బందులు పడ్డారు. మండే ఎండలు, ఉక్కపోతతో విలవిల్లాడారు. చిన్నారులు, వృద్ధుల తిప్పలు చెప్పనలవికావు. చిరు వ్యాపారులు లేక నిర్వాహకులు ఖాళీగా కూర్చోవాల్సి వచ్చింది. సెల్‌ఫోన్‌లో సిగ్నల్ సమస్య కూడా తలెత్తింది.



ముదిగుబ్బలో విద్యుత్ తీగలను తొలగించిన సిబ్బంది

జగన్ రాకతో కరెంటు కష్టాలు

-చల్లా శ్రీనివాసులు, సీపీఐ మండల కార్యదర్శి, ముదిగుబ్బ మండలం



జగన్ బస్సు యాత్రతో మండలంలో విద్యుత్ సరఫరా ఆపేశారు. దీంతో చిన్నారులు ఉక్కపోతతో విలవిల్లాడారు. వ్యాపారాలు లేక షాపుల నిర్వాహకులు ఖాళీగా ఉండాల్సి వచ్చింది.

ఎప్పుడూ ఈ పరిస్థితి లేదు

- అన్నమనేని దామోదర్, రైతు, ముదిగుబ్బ



గతంలో ఎంతోమంది నాయకులు మండలానికి వచ్చినా ఇలాంటి సమస్య ఎన్నడూ తలెత్తలేదు. చిరు వ్యాపారులు, రైతులు, ప్రజలు విద్యుత్ సమస్యతో, ట్రాఫిక్ సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

సమస్యను పరిష్కరిస్తాం

బాలసుబ్రహ్మణ్యం, కదిరి విద్యుత్ ఏడీ

సీఎం పర్యటన సందర్భంగా రోడ్డులో అడ్డుగా ఉన్న విద్యుత్ తీగలను తొలగించడంతో సమస్య ఏర్పడింది. మరమ్మతులు చేపట్టి, విద్యుత్ సరఫరాను పునరుద్ధరిస్తాం.

నిధుల కొరతతోనే పింఛన్ల పంపిణీ ఆలస్యం

- జగన్‌వి దిగజారుడు రాజకీయాలు
- టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీవీ వెంకటరాముడు



పుట్టపర్తి, ఏప్రిల్ 1: రాష్ట్ర ఖజానాలో నిధుల్లేకే పింఛన్ పంపిణీ జాప్యమవుతోందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీవీ వెంకటరాముడు పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన సోమవారం ప్రకటన విడుదల చేశారు. ముఖ్యమంత్రి జగన్ స్వార్థ రాజకీయాల కారణంగా పింఛన్‌దారులు, వలంటీర్లు నష్టపోతున్నారన్నారు. ఇందుకు తెలుగుదేశం పార్టీ కారణం కాదన్నారు. మార్చి 16 నుంచి 30వ తేదీ మధ్య ఎన్నికల నియమావళిని ఉల్లంఘించి సీఎం జగన్ సొంత కాంట్రాక్టర్లకు 13 వేలకోట్ల రూపాయలు అడ్డగోలుగా దోచిపెట్టారని ఆరోపించారు. రాష్ట్ర ఖజానాను ఖాళీ చేసి, ఏప్రిల్ 1న పింఛన్ల పంపిణీకి టీడీపీ అడ్డు తగిలిందని విమర్శించడం జగన్ దిగుజారుడు రాజకీయాలకు నిదర్శనమన్నారు. ఇంటి దగ్గరే పింఛన్ల పంపిణీకి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పోస్టల్ బ్యాలెట్ జారీపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి



వీడియో కాన్ఫరెన్సులో పాల్గొన్న కలెక్టర్ ఇతర అధికారులు

పుట్టపర్తి, ఏప్రిల్ 1: పోస్టల్ బ్యాలెట్, ఇంటి దగ్గరే ఓటుపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్‌కుమార్ మీనా ఆదేశించారు. రాష్ట్ర సచివాలయం ఆయన సోమవారం వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. పోస్టల్ బ్యాలెట్ వినియోగంపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్సు హాల్ నుంచి కలెక్టర్ అరుణ్‌బాబు, నియోజకవర్గాల ఎన్నికల అధికారులు పాల్గొన్నారు. వివిధ శాఖల్లో పనిచేసే ఉద్యోగులు, 85 సంవత్సరాలు పైబడిన వృద్ధులు, దివ్యాంగులకు ఇంటివద్దే ఓటు వేసే అవకాశం కల్పించడంపై అధికారులు నిబద్ధతగా పనిచేయాలని ఆదేశించారు. అనంతరం జిల్లా కలెక్టర్.. పోస్టల్ బ్యాలెట్‌పై అధికారులతో సమీక్ష నిర్వహించారు. 22వేల పోస్టల్ బ్యాలెట్లు అవసరమనీ, ఇందుకు సంబంధించి నియోజవర్గాల వారీగా నివేదికలు సిద్ధం చేయాలన్నారు. ఎన్నికల నిర్వహణకు 12వేల మంది సిబ్బంది, 5 వేలు అత్యవసర సేవలకు, 1800 మంది పోలీసులు, 25 ఏళ్లపైబడిన వివిధ ప్రతిభావంతులు ఉన్నారన్నారు. కార్యక్రమంలో జేసీ అభిషేక్ కుమార్, సబ్ కలెక్టరు అపూర్వ భరత్, డీఆర్వో కొండయ్య, నియోజకవర్గ ఎన్నికల అధికారులు భాగ్యరేఖ, వంశీకృష్ణ, గౌరీశంకర్ పాల్గొన్నారు.



	ఇఫ్తార్	సెహరీ
పుట్టపర్తి	6.35 మంగళవారం (సాయంత్రం)	4.53 బుధవారం (ఉదయం)
కదిరి	6.31 మంగళవారం (సాయంత్రం)	4.58 బుధవారం (ఉదయం)
ధర్మవరం	6.37 మంగళవారం (సాయంత్రం)	4.55 బుధవారం (ఉదయం)
హిందూపురం	6.35 మంగళవారం (సాయంత్రం)	4.59 బుధవారం (ఉదయం)
పెనుకొండ	6.33 మంగళవారం (సాయంత్రం)	4.57 బుధవారం (ఉదయం)

కోలాహలంగా తీర్థవాది



గరుడ పతాకాన్ని అవరోహణం గావిస్తున్న అర్చకులు

కదిరి, ఏప్రిల్ 1: శ్రీఖాద్రీ లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం తీర్థవాది కోలాహలంగా సాగింది. ఉదయం నిత్యపూజ, హోమం, అనంతరం శ్రీదేవి, భూదేవి సమేతంగా శ్రీవారు ఆలయ ప్రాంగణంలో కొలువుదీరారు. బ్రహ్మోత్సవాల్లో సేవలు అందించిన వివిధ ప్రభుత్వ శాఖల సిబ్బంది, ఆలయ అర్చకులు, అధికారులు, సిబ్బంది, భక్తులు శ్రీవారి వెంట నడుస్తూ రంగులు చల్లుకుని ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం అమ్మవార్లు, శ్రీవారిని ఆలయ పడమటి దిక్కున ఉన్న భృగుతీర్థం వద్దకు చేర్చి, అభిషేకాలు నిర్వహించారు. భక్తుల గోవిందనామ స్మరణ మధ్య శ్రీచక్ర స్నానం ఘనంగా ముగిసింది. భక్తులు కోనేటిలో స్నానం చేశారు. అనంతరం శ్రీవారు తిరువీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. యాగశాలలో హోమం అనంతరం శ్రీవారు ఆలయ ప్రవేశం గావించారు. ఉత్సవాల్లో కల్యాణోత్సవం రోజున ధ్వజస్తంభానికి ఆరోహణం చేసి, గరుడ పతాకాన్ని ఈ సందర్భంగా అవరోహణం గావించారు. శ్రీవారి ఆలయ ప్రవేశంతో ప్రధాన ద్వారాలను మూసివేశారు. సోమవారం అన్నిరకాల దర్శనాలను రద్దు చేశారు. తిరిగి మంగళవారం ఉదయమే శ్రీవారి దర్శనానికి అనుమతి ఇస్తారు.



తీర్థవాది నిర్వహిస్తున్న అర్చకులు



శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారికి చందనాభిషేకం



శ్రీవారికి అభిషేకం

తీర్థవాదికి కుంకుమ, గాజులు ప్రత్యేకం

కదిరి నరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో కదిరి కుంకుమ, గాజులకు ప్రత్యేకత ఉంది. తీర్థవాది రోజున తిరువీధుల్లో అమ్మే కుంకుమ, గాజులను కదిరి ప్రాంతంలోని ఆడపడుచులందరూ కొనుగోలు చేస్తారు. కుంకుమను కొనుగోలు చేసి సంవత్సరం వరకు దీనిని వాడుకుంటారు. ఇళ్లకు వచ్చిన ఆడపడుచులకు గాజులు, కుంకుమతోపాటు కదిరి మల్లెలు ఇవ్వడం ఇక్కడి ఆనవాయితీ. అందుకే పెద్దఎత్తున వీటిని కొనుగోలు చేస్తారు.

నేడు పుష్పయాగోత్సవం

శ్రీ ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో మంగళవారం పుష్పయాగోత్సవం నిర్వహించనున్నారు. ఈ ఉత్సవంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి. శ్రీవారికి అన్ని రకాలు పుష్పాలు, సుగంధ ద్రవ్యాలతో యాగోత్సవం నిర్వహిస్తారు. అన్ని రకాల పుష్పాలను స్వామి వారి ముందు ఉంచుతారు. అన్ని యాగాల మాదిరే స్వామివారికి వివిధ పుష్పాలతో యాగోత్సవం నిర్వహించడం ద్వారా స్వామివారిని ప్రసన్నం చేసుకుంటారు.

మారని తీరు..

- జగన్ బస్సుయాత్రలో వలంటీర్లు
- ప్రచారంలో సైతం పాల్గొన్న వైనం

కదిరిఅర్బన్, ఏప్రిల్ 1: ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తూ వలంటీర్లు.. అధికార పార్టీ సేవలో తరిస్తున్నారు. ముఖ్యమంత్రి జగన్ చేపట్టిన బస్సుయాత్ర సోమవారం మండలంలోని కాళసముద్రం గ్రామానికి చేరుకుంది. గ్రామంలో ఉపాధి పథకంలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్ భానుచంద్రుడు ప్రజలను బస్సుయాత్రకు తరలించాడు. అలాగే ఎర్రదొడ్డి కొత్తపల్లికి చెందిన వలంటీర్ గంగాదేవి ఎరికిలవాండ్లపల్లి వద్ద తమ పరిధిలోని ప్రజలను తరలించి, యాత్రలో పాల్గొంది.





కదిరి: బస్సుయాత్రలో పాల్గొన్న ఫీల్డ్ అసిస్టెంట్ భానుచంద్రుడు, బత్తలపల్లిలో మేడాపురం లైన్‌మన్ కొండారెడ్డి (వృత్తాల్లో..)

బత్తలపల్లి: మండలంలో జగన్ బస్సుయాత్రలో వలంటీర్లు పరశురాంబాబు, దివాకర్, గంగాధర్, సంగాల పంచాయతీ ఫీల్డ్ అసిస్టెంట్ చెన్నారెడ్డి, మేడాపురం లైన్‌మన్ కొండారెడ్డి పాల్గొన్నారు. మంత్రి ఉషశ్రీ పెనుకొండలో ఆదివారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఎండీయూ ఆపరేటర్ యాసీన్ పాల్గొన్నాడు. అతడికి అధికారులు నోటీసులు ఇవ్వడంతో రాజీనామా చేశాడు.

క్షేత్ర సహాయకుడిపై చర్యలకు సిఫార్సు

బుక్కపట్నం: మండలంలోని మారాల గ్రామంలో పనిచేస్తున్న ఉపాధి క్షేత్ర సహాయకుడు రామ్మోహన్ ఆదివారం హిందూపురం వైసీపీ ఎంపీ అభ్యర్థి శాంత ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. దీనిపై విచారణ చేసి, రామ్మోహన్‌పై చర్యలు తీసుకోవాలని డ్వామా పీడీకి సిఫార్సు చేసినట్లు ఎంపీడీఓ శ్రీనివాసులు తెలిపారు. క్షేత్ర సహాయకుడికి నోటీసు అందించినట్లు ఎంపీడీఓ తెలిపారు.



ఫ్లెక్సీ పట్టుకుని బైక్‌లో హల్‌చల్ చేస్తున్న వలంటీర్లు పరశురాంబాబు, దివాకర్, గంగాధర్



బస్సుయాత్రలో సంగాల ఫీల్డ్ అసిస్టెంట్ చెన్నారెడ్డి

నిబంధనల మేరకు కమీషన్ వసూలు చేయాలి

● మార్కెట్ యార్డు ఎంపికశ్రేణి కార్యదర్శి జయలక్ష్మి



మాట్లాడుతున్న యార్డు కార్యదర్శి జయలక్ష్మి

అనంతపురంరూరల్, ఏప్రిల్ 1: చీనీ మార్కెట్‌లో నిబంధనల మేరకు రైతుల నుంచి కమీషన్ వసూలు చేయాలని అనంతపురం మార్కెట్ యార్డు ఎంపికశ్రేణి కార్యదర్శి జయలక్ష్మి సూచించారు. ఆ మేరకు సోమవారం యార్డులోని తన చాంబర్‌లో వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. మర్కెట్‌లో రైతుల నుంచి 10 శాతం కమీషన్ వసూలు చేస్తున్నట్లు తమకు ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. నిబంధనల ప్రకారం 4 శాతం మాత్రమే కమీషన్ వసూలు చేయాలన్నారు. మార్కెట్‌కు వచ్చే రైతులకు ఎలాంటి నష్టం జరకుండా చూడాల్సిన బాధ్యత తమపై ఉందన్నారు. దీనిపై పలువురు వ్యాపారులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. చట్టప్రకారం కమీషన్ నాలుగుశాతం వసూలు చేస్తున్నామన్నారు. సూట్, గ్రేడింగ్ లేకుండానే కాయలు కొనుగోలు చేస్తున్నామన్నారు. ఎక్కడ ఈ విధంగా కొనుగోలు చేయడం లేదన్నారు. పులివెందుల మార్కెట్‌లో బాడుగలు, ఇతరాత్రవీ ఏవీ లేకుండానే ఎనిమిది శాతం కమీషన్ రూపంలో తీసుకొంటూ వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారని కార్యదర్శి దృష్టి వ్యాపారులు తెచ్చారు.

ఏపీపీఎస్సీ కుంభకోణంపై ఫిర్యాదు

● ప్రభుత్వ పెద్దలపై కేసు నమోదు చేయాలి

● టీఎన్ఎస్ఎఫ్, తెలుగు యువత డిమాండ్



సీఐకి ఫిర్యాదు చేస్తున్న టీఎన్ఎస్ఎఫ్, తెలుగు యువత నాయకులు

పుట్టపర్తి రూరల్, ఏప్రిల్ 1: ఏపీపీఎస్సీ కుంభకోణంపై ముఖ్యమంత్రి జగన్, ఏపీపీఎస్సీ చైర్మన్ గౌతమ్ సవాంగ్, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డిపై కేసు నమోదు చేయాలంటూ తెలుగు యువత, టీఎన్ఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం తెలుగుయువత, టీఎన్ఎస్ఎఫ్ నాయకులు జిల్లాకేంద్రంలోని అర్బన్ పోలీసు స్టేషన్‌లో సీఐ కొండారెడ్డికి ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా వేలాదిమంది నిరుద్యోగులు ఏళ్లుగా కష్టపడి చదువుతూ గ్రూప్1 పరీక్ష రాశారన్నారు. అనంతరం మూల్యాంకనంలో భారీగా అక్రమాలకు పాల్పడి అర్హులకు కాకుండా తమ అస్మదీయులకు ఉద్యోగాలు కట్టబెట్టిన ఏపీపీఎస్సీ చైర్మన్, ఏపీపీఎస్సీ సెక్రటరీ, ప్రభుత్వ సలహాదారుపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తెలుగుయువత, టీఎన్ఎస్ఎఫ్ నేతలు అంబులెన్సు రమేష్, ఓబుళరెడ్డి, నియోజకవర్గ టీఎన్ఎస్ఎఫ్ అధ్యక్షుడు శ్రీనివాసులు, కృష్ణారెడ్డి, వైపీ మురళీచౌదరి, బొల్లే సుధీర్, యనమల గంగాధర్, శ్రీనివాస్‌రెడ్డి, గణేష్‌చౌదరి పాల్గొన్నారు.

బీఈడీ కోర్సులకు స్పాట్ అడ్మిషన్లు

అనంతపురం సెంట్రల్, ఏప్రిల్ 1: ఎస్కేయూ బీఈడీ కళాశాలలో మిగిలిపోయిన సీట్లకు స్పాట్ అడ్మిషన్‌ల ప్రక్రియ చేపడుతున్నట్లు ప్రిన్సిపాల్ సదాశివరెడ్డి సోమవారం ప్రకటనలో తెలిపారు. బుధవారం నిర్వహించే ఈ ఇంటర్వ్యూలకు ఏపీ ఎడ్‌సెట్-2023లో అర్హత సాధించిన వారు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని కోరారు. అడ్మిషన్ అయిన విద్యార్థులు అదే రోజు ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌ను వినియోగించుకోండి

● జిల్లా న్యాయాధికారి శ్రీనివాస్

అనంతపురం క్రైం, ఏప్రిల్ 1: శ్రీసత్యసాయి జిల్లాలో మే 11న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయాధికారి శ్రీనివాస్ కోరారు. ఈ మేరకు సోమవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన స్పష్టం చేశారు. మే నెల రెండో శనివారం ఉదయం 10.30 గంటలకు అన్ని కోర్టులలో నిర్వహించే అదాలత్‌లో మోటారు వాహనాల ప్రమాదభరిత కేసులు, సివిల్ కేసులు, చెక్ బౌన్స్ కేసులు, కుటుంబ తగాదాలు, పారిశ్రామిక వివాదాలు తదితర కేసులు రాజీ చేస్తారన్నారు. సంబంధిత కక్షిదారులు అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఐటీఐ విద్యార్థులకు ఉద్యోగ మేళా

అనంతపురం సెంట్రల్, ఏప్రిల్ 1: ఐటీఐ పూర్తిచేసిన నిరుద్యోగ యువతీ, యువకులకు అనంతపురం ప్రభుత్వ బాలుర ఐటీఐ కళాశాలలో జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రామమూర్తి సోమవారం ప్రకటనలో తెలిపారు. టాప్‌లైన్ బిజినెస్ మేనేజ్‌మెంట్, హోండా లాజిస్టిక్స్ సంస్థల్లో పనిచేసేందుకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఐటీఐ నుంచి ఏదేని ట్రేడ్ పూర్తిచేసిన వారు అర్హులన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన వారికి రూ.12వేల నుంచి రూ.16వేల వరకు జీతం చెల్లిస్తారన్నారు. అసక్తిగలవారు 3వ తేదీన కళాశాలలో నిర్వహించే ఇంటర్వ్యూలకు వారి బయోడేటాతో హాజరుకావాలని కోరారు.

మార్కెట్ ఫీజు వసూళ్ల టార్గెట్ పూర్తి

అనంతపురంరూరల్, ఏప్రిల్ 1: జిల్లా మార్కెటింగ్ శాఖ లక్ష్యాన్ని పూర్తి చేసింది. రాష్ట్ర మార్కెటింగ్ శాఖ కమిషన్ జిల్లా శాఖకు 2023-24 ఆర్థిక సంవత్సరానికి రూ.10కోట్లకుపైగా లక్ష్యాన్ని నిర్దేశించారు. ఈలక్ష్యాన్ని మార్చి అఖరికి పూర్తి చేసి లక్ష్యాన్ని అధిగమించింది. గత ఆర్థిక సంవత్సరం జిల్లా మార్కెటింగ్ శాఖ పరిధిలోని మార్కెట్ యార్డులకు రూ.10.81కోట్ల టార్గెట్ కేటాయించారు. ఇందులో గుత్తి, గుంతకల్లు మార్కెట్ యార్డులు మినహాయిస్తే అన్ని యార్డులు తమ లక్ష్యాన్ని చేరుకున్నాయి. అనంతపురం మార్కెట్ యార్డుకు రూ.4.10 కోట్లుకాగా..4.27 కోట్లు వసూలు చేసింది. గుత్తి మార్కెట్ యార్డు రూ.28లక్షలుకాగా..రూ.21.61 లక్షలు, గుంతకల్లు రూ.85 లక్షలు కాగా రూ.58.56 లక్షలు, కళ్యాణదుర్గం యార్డు రూ.52 లక్షలు కాగా రూ.61.01 లక్షలు, రాప్తాడు యార్డు రూ.50లక్షలు కాగా రూ.49.54లక్షలు, రాయదుర్గం రూ.1.20 కోట్లు కాగా రూ.1.32 కోట్లు, శింగనమల రూ.75 లక్షలుకాగా రూ.1.01 కోట్లు, తాడిపత్రి రూ.1.85 కోట్లు కాగా1.90 కోట్లు, ఉరవకొండ రూ.76 లక్షలు కాగా రూ.89.36లక్షల మార్కెట్ ఫీజు వసూలు చేశాయి. మొత్తంగా రూ.11.30కోట్లు వసూలు చేసి 104.62 శాతంతో రాష్ట్రంలో జిల్లా ఆరో స్థానంలో నిలిచింది. కార్యదర్శులు, ఉద్యోగులు, సిబ్బంది సమష్టి కృషితో లక్ష్యానికి చేరుకున్నట్లు ఏడీ సత్యనారాయణ చౌదరి తెలిపారు.

ఫర్టిలైజర్ దుకాణ యజమాని దారుణ హత్య

నార్పల, ఏప్రిల్ 1: మండల కేంద్రంలోని రేణుక ఫర్టిలైజర్ దుకాణ యజమాని వీరభద్ర(40) దారుణ హత్యకు గురయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కడప జిల్లా పులివెందులకు చెందిన వీరభద్రకు 12 ఏళ్ల క్రితం నార్పల మండలంలోని గడ్డం నాగేపల్లికి చెందిన రేణుకతో వివాహమైంది. వీరభద్ర అప్పటి నుంచి నార్పలలోనే నివాసం ఉంటూ గడ్డంనాగేపల్లికి చెందిన సమీప బంధువుతో కలిసి ఎరువుల దుకాణం నిర్వహిస్తుండేవాడు. అంతకుముందు ఐదు సంవత్సరాలు వీరభద్ర వారి సమీప బంధువుతోనే ఎరువుల దుకాణం నిర్వహించాడు. వారివురి మధ్య ఆర్థిక సమస్యలు తలెత్తడంతో వేరువేరుగా దుకాణాలు నడుపుతున్నారు. వీరభద్ర సమీప బంధువుతో ఈ విషయంపై అప్పుడప్పుడు ఘర్షణలు పడుతుండేవారు. ఇదే క్రమంలో పక్కా ప్లాన్ ప్రకారం బంధువు మరొకరితో కలిసి వేటకొడవళ్లతో వీరభద్ర ఎరువుల దుకాణంలోకి చొరబడి, తలుపులు మూసేసి విచక్షణారహితంగా కొడవళ్లతో నరికారు. దీంతో వీరభద్ర అక్కడికక్కడే మృతిచెందాడు. నిందితులు అక్కడి నుంచి ద్విచక్రవాహనంపై పరారయ్యారు. వీరభద్రకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఘటనా స్థలాన్ని డీఎస్పీ వెంకటశివారెడ్డి పరిశీలించారు. భార్య రేణుక ఫిర్యాదు మేరకు ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేపట్టారు.

అటవీశాఖకు అవినీతి మసి



అనంతపురం న్యూటౌన్, ఏప్రిల్ 1: జిల్లా అటవీశాఖకు అవినీతి 'మసి' అంటుకుంది. ముళ్లకంపల నుంచి తయారు చేసుకొనే బొగ్గు తయారు కావాలన్నా కిల్లీ కిల్లీకి కప్పం కట్టాల్సిందేనని కొందరు వాపోతున్నారు. ధర్మవరం డిప్యూటీ రేంజర్ అనంతపురం రేంజ్‌లో అనంతపురం సర్కిల్‌తో పాటు, ఆత్మకూరు సర్కిల్‌కు కూడా ఒకరే ఇన్‌చార్జి కావడంతో అక్రమాలకు అడ్డూ అదుపు లేకుండా పోయిందన్న ప్రచారం సాగుతోంది. కప్పం కడితేనే అనుమతులు వస్తాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. నిజాయితీ గల డీఎఫ్ఓ పేరుతో సిబ్బంది వసూళ్లకు పాల్పడడం విడ్డూరం. కిల్లీల అనుమతికి కార్యాలయానికి రావాలంటేనే ఫ్యాక్టరీల నిర్వాహకులు భయపడుతున్నారన్న చర్చ జరుగుతోంది. అధికారులు మారిన ప్రతిసారి సిబ్బంది ఇలా అక్రమాల పర్వానికి దిగుతున్నారన్న ప్రచారం సాగుతోంది. ఇప్పటికైనా డీఎఫ్ఓ స్పందించకపోతే సిబ్బంది ఆగడాలకు అడ్డులేకుండా పోతుందని పలువురు అంటున్నారు.



రాప్తాడు ప్రాంతంలో నిర్వహిస్తున్న బొగ్గుల బట్టీ

● బొగ్గు బట్టీల నిర్వహణకు రూ.లక్షల్లో కప్పం..

● అనుమతి ఒకచోట.. నిర్వహణ మరోచోట..

● డీఎఫ్ఓ పేరుతో వసూళ్ల దందా..

● అక్రమాలపై విమర్శల వెల్లువ



జిల్లా అటవీశాఖ కార్యాలయం

నిబంధనలకు నీళ్లు..

బొగ్గు బట్టీలకు సంబంధించి అనుమతి ఇవ్వాలంటే అటవీ ప్రాంతానికి 5 కిలోమీటర్ల లోపు అనుమతి ఇవ్వడానికి వీలు లేదు. ముడుపులు పుచ్చుకొని యథేచ్ఛగా సమీపంలోనే అనుమతులు ఇస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. డివిజన్ పరిధిలో బొగ్గు బట్టీల్లో పెద్ద ఎత్తున అక్రమాలకు పాల్పడుతుంటే.. డీఎఫ్ఓ అడ్డుకోకపోవడం విమర్శలకు తావువిస్తోంది. ధర్మవరం, ధర్మపురి, దర్శినమల, రాప్తాడు, మర్తాడు, శింగనమల, పెద్ద పప్పూరు మండలం, పెద్ద ఎక్కులూరులోను, అదే విధంగా పెద్దవడుగూరు ప్రాంతాల్లో అనధికారికంగా పెద్ద ఎత్తున కిల్లీలు నిర్వహిస్తున్నా.. సిబ్బంది చూసీచూడనట్లు వదిలేస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

అమ్మ్యామ్యాలిస్తేనే.. అనుమతులు..!

అనంతపురం రేంజర్‌లో డీఎఫ్ఓ బాధ్యతలు చేపట్టిన తరువాత పేరుకు మాత్రం ప్రభుత్వం నుంచి నిధులు లేవు. అయితే అక్రమ మార్గాల ద్వారా సిబ్బంది జేబులు నింపుకుంటున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రేంజ్ పరిధిలో ఏవైనా నూతన నిర్మాణాలకు చెట్లు తొలగించాలంటే అనుమతి కోసం కార్యాలయం చుట్టూ తిరగాల్సిందే. దీంతో పాటు చేయి తడపాల్సిందే. అనుమతి లేకుండా తొలగిస్తే, దొరికిన తర్వాత సిబ్బంది చుక్కలు చూపిస్తారన్న విమర్శలు ఉన్నాయి.

ప్రతి పర్మిట్‌కు రూ.10వేలు..

బొగ్గుల బట్టీ అనుమతులు తీసుకున్నప్పటికీ, బొగ్గును తరలించడానికి అనుమతి తప్పనిసరి. ఒకసారి అనుమతి పొందితే 8 సార్లు బొగ్గు తరలించే అవకాశం ఉంది. ఇక్కడ తరలించిన ప్రతీసారి రూ.10 వేలు ఇవ్వాల్సిందేనన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అధికారుల పేరుతో సిబ్బంది చేస్తున్న ఆగడాలకు అడ్డులేకుండా పోయిందని, ఇప్పటికైనా డీఎఫ్ఓ వారి ఆగడాలకు అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఉంది.

రెన్యువల్‌కు ముడుపులు ఇవ్వాల్సిందే..

జిల్లాలో 60కి పైగా రంపపు కోత మిల్లులు ఉన్నాయి. వీటిలో ఎక్కువ శాతం అనంతపురం, గుత్తి రేంజ్‌లోనే ఉన్నాయి. మిల్లులకు అనుమతులున్నప్పటికీ, ఏటా రెన్యువల్ చేసుకోవాల్సిందే. రెన్యువల్ చేసుకోవడానికి ముడుపులు లేనిదే ఫైల్ కదలడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. మొత్తానికి ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడంతో అటవీశాఖలో అక్రమాలకు అడ్డూ అదుపులేకుండా పోయిందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ప్రత్యేక నిఘాతో అవినీతిని అరికట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

పోలింగ్ సిబ్బంది జాబితాకు కలెక్టరు ఆమోదం

● పీఓలు 2,552, ఏపీఓలు 2,715 మంది..

● 5, 7, 14 తేదీల్లో శిక్షణ

అనంతపురం టౌన్, ఏప్రిల్ 1: ఎన్నికల నిర్వహణకు సంబంధించి పోలింగ్ సిబ్బంది ఎంపిక పక్రియ పూర్తయ్యింది. నెలరోజులుగా పోలింగ్ ప్రిసైడింగ్ ఆఫీసర్లు, అసిస్టెంట్ పోలింగ్ ఆఫీసర్ల ఎంపికకు జిల్లా యంత్రాంగం కుస్తీపడుతోంది. ఎట్టకేలకు పీఓలు, ఏపీఓల జాబితాను సిద్ధం చేశారు. ఎనిమిది నియోజకవర్గాలకు చెందిన జాబితాను మంగళవారం కలెక్టరు గౌతమి వద్దకు తీసికెళ్లగా ర్యాండమ్‌గా చెక్ చేసి పీఓ, ఏపీఓల జాబితాకు ఆమోదం తెలిపారు. జాబితా ప్రకారం పీఓలు 2,552 మంది ఉండగా అసిస్టెంట్ ఏపీఓలు 2,715 మంది ఉన్నారు. అనంతరం కలెక్టరు మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణకు ఎంపికైన ప్రతి ఒక్కరికి నియామక ఉత్తర్వులను ఆయా శాఖల అధికారులు అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. వారందరూ తప్పకుండా ఎన్నికల శిక్షణకు హాజరుకావాల్సి ఉంటుందన్నారు. సంబంధిత రిటర్నింగ్ అధికారులు ఎంపికైన పోలింగ్ సిబ్బంది పీఓలు, ఏపీఓలకు తెలపాలన్నారు. పోలింగ్‌కు నియమితులైన వారందరూ శిక్షణకు వచ్చేటపుడు పోస్టల్ బ్యాలెట్ కోసం ఫామ్-12ను పూరించి వచ్చేలా ఆర్ఓలు చూసుకోవాలన్నారు.

ఈ నెల 5, 7, 14వ తేదీల్లో శిక్షణ

సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు ఎంపికైన పీఓలు, ఏపీఓలకు ఈనెల 5, 7, 14వ తేదీల్లో శిక్షణ ఏర్పాటు చేయాలని కలెక్టరు గౌతమి ఆర్ఓలను ఆదేశించారు. అనంతపురం అర్బన్ నియోజకవర్గం (ప్రభుత్వ జూనియర్ కళాశాల), రాయదుర్గం (రాయదుర్గం ప్రభుత్వజూనియర్ కలాశాల), ఉరవకొండ (ఉరవకొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాల), గుంతకల్లు (గుంతకల్లు సర్వేపల్లి రాధాకృష్ణ మున్సిపల్ హైస్కూల్) తాడిపత్రి (తాడిపత్రి పాలిటెక్నిక్ కాలేజ్), శింగనమల (బుక్కరాయసముద్రం ఆర్డీటీ హియరింగ్ స్కూల్), కళ్యాణదుర్గం (కళ్యాణదుర్గం ప్రభుత్వ డిగ్రీ కళాశాల) రాప్తాడు (పంగల్ రోడ్డు టీటీడీసీ భవనం)లో శిక్షణ ఏర్పాటు చేసినట్లు కలెక్టరు తెలిపారు.



పోలింగ్ సిబ్బంది జాబితాను పరిశీలిస్తున్న కలెక్టరు గౌతమి

జిల్లాలో 2.89 లక్షల మందికి పింఛన్

● రూ.86.58కోట్లు మంజూరు



అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 1: ఏప్రిల్ నెలకు సంబంధించి జిల్లాకు 2,89,131 మంది లబ్ధిదారులకు పింఛన్ మంజూరు చేశారు. మొత్తం రూ.86.58 కోట్లు నిధులు విడుదల చేశారు. ఇందులో వృద్ధులు 1,45,839 మందికి గాను రూ.43.75కోట్లు, వితంతువులు 66,868 మందికి రూ.20 కోట్లు, విభిన్నప్రతిభావంతులు 46,664 మందికి రూ.13.99 కోట్లు, చేనేతలు 6,793 మందికి రూ.2 కోట్లు, ఒంటరి మహిళలు 6,744 మందికి రూ.2 కోట్లు, అభయహస్తం 4,273 మందికి రూ.21లక్షలు, కల్లుగీత కార్మికులు 3,532మందికి రూ.1.06కోట్లు, మెడికల్ 3,271 మందికి రూ.1.64కోట్లు, డప్పు కళాకారులు రూ.94 లక్షలు, మత్స్యకారులు 893 మందికి రూ.26 లక్షలు, సఫాయి కర్మాచారులు 356 మంది రూ.10 లక్షలు, సీకేడీయూ 347 మందికి రూ.34 లక్షలు, హిజ్రాలు 208 మందికి రూ.62 వేలు, కళాకారులు 185 మందికి రూ.56 వేలు, సైనికవెల్ఫేర్ 6 మంది రూ.3వేలు మంజూరు చేశారు. పెన్షన్ మంజూరైన లబ్ధిదారులు ఈనెల 3వ తేదీ నుంచి ఆయా గ్రామ-వార్డు సచివాలయాల వద్ద పింఛన్ నగదు తీసుకోవాలని డీఆర్‌డీఏ-వైకేపీ పీడీ నరసింహారెడ్డి తెలిపారు.

'స్పాట్'కు రాం...రాం ...!

● 30 శాతం అదనంగా వేసినా... బేజారు

● స్పెషల్ అసిస్టెంట్లు చాలావరకు డుమ్మా

● డీఈఓ వరలక్ష్మి ఆగ్రహం

● తర్వాత ఒక్కొక్కరుగా విధుల్లోకి..

● సాయంత్రానికి కొలిక్కి..

అనంతపురం విద్య, ఏప్రిల్ 1: పదో తరగతి పరీక్షల మూల్యాంకనానికి మెజార్టీ ఉపాధ్యాయులు రాం..రాం అంటూ మారాం చేశారు. మధ్యాహ్నం 2 గంటల వరకూ అదే పరిస్థితి. ముఖ్యంగా స్పెషల్ అసిస్టెంట్లు చాలా మంది గైర్హాజరయ్యారు. అయితే ఉత్తర్వులు జారీ అయిన వారు విధుల్లో చేరకుంటే... మెమోలు ఇస్తామంటూ డీఈఓ కఠినంగా వ్యవహరించడంతో తర్వాత టీచర్లు ఒక్కరొక్కరుగా విధుల్లో చేశారు. సాయంత్రానికి సమస్య కొలిక్కి వచ్చింది. పదో తరగతి పరీక్షల మూల్యాంకనం సోమవారం నుంచి ప్రారంభమైంది. జిల్లా కేంద్రంలోని కేఎస్ఆర్ హైస్కూల్, కేఎస్ఆర్ జూనియర్ కళాశాల ప్రాంగణలోని పలు గదుల్లో స్పాట్‌కు ఏఈలు, సీఈలు, స్పెషల్ అసిస్టెంట్లు, ఇతర సిబ్బంది 1154 మందిని నియమించారు. 835 మంది ఏఈలు, సీఈలకు గాను మధ్యాహ్నం 2 గంటల వరకూ కేవలం 562 మంది మాత్రమే ఎగ్జామినర్లు రిపోర్ట్ చేసుకున్నారు.



పది పరీక్ష పేపర్ల మూల్యాంకనం చేస్తున్న ఉపాధ్యాయులు



స్పాట్‌కు హాజరైన వారి వివరాలు తెలుసుకుంటున్న డీఈఓ వరలక్ష్మి

తెలుగు సబ్జెక్టుకు సంబంధించి 118 మందికిగాను 88 మంది, హిందీ 91 మందికి గాను 73మంది, ఇంగ్లీష్ 92 మందికిగాను 89 మంది, గణితం 82 మందికిగాను 81 మంది, ఫిజికల్ సైన్స్ 88మందిగాను 80 మంది, బయాలజీ 75 మందిలో 67 మంది, సోషల్ 100 మందిలో 84 మంది మాత్రమే హాజయ్యారు. కావాల్సిన సిబ్బంది కంటే 30 శాతం మందిని అదనంగా నియమించినా, వివిధ కారణాలు చూపుతూ మెజార్టీ ఎగ్జామినర్లు విధుల్లో చేరకుండా చెట్ల కింద కూర్చొని, ఎలాగైనా మినహాయింపు ఇస్తారన్నట్టుగా చాలా మంది చూస్తూ వచ్చారు. డీఈఓ వరలక్ష్మి గట్టిగానే హెచ్చరించారు. చంటి బిడ్డలు ఉన్న తల్లులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, ఇతరవైద్య సమస్యలున్న వాళ్లకు మాత్రమే మినహాయింపు ఇస్తామని, మిగిలిన వారంతా హాజరు కావాలంటూ హెచ్చరించారు. ఉత్తర్వులు అందుకుని, సహేతుక కారణాలు లేకుండా పరీక్షల మూల్యాంకనం డ్యూటీ నుంచి మినహాయింపు పొందాలని చూస్తే సహించేది లేదని హెచ్చరించారు. మెమోలు జారీ చేస్తామన్నారు. దీంతో తమ పరిధిలోని ఉపాధ్యాయులను వెంటనే విధుల్లో చేరేలా చూడాలని ఎంఈఓలను సైతం డీఈఓ ఆదేశించారు. సాయంత్రానికి ఒక్కరొక్కరుగా విధుల్లో చేరడంతో...అధికారులు కొంత ఊపిరి పీల్చుకున్నారు. అనంతరం డీఈఓ మాట్లాడుతూ స్పాట్ విధులకు నియమించిన సిబ్బంది పూర్తిస్థాయిలో హాజరయ్యారని, నిజమైన అనారోగ్య సమస్యలు, చంటి బిడ్డల తల్లులు వంటి వారికి మినహాయింపు ఇచ్చామన్నారు. ఏదైనా సబ్జెక్టుకు అవసరం ఉన్నచోట.. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏసీ గోవింద్‌నాయక్, డిప్యూటీ డీఈఓ శ్రీదేవి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



విద్యాశాఖ ఆర్జేడీకి వినతిపత్రం అందజేస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

మూల్యాంకన వేతన

బకాయిలు చెల్లించాలి

ఏపీటీఎఫ్, యూటీఎఫ్ డిమాండ్



డీఈఓకి వినతిపత్రం అందిస్తున్న యూటీఎఫ్ నాయకులు

కొత్తచెరువు, ఏప్రిల్ 1: మూల్యాంకన వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని ఉపాధ్యాయ సంఘాలు ఏపీటీఎఫ్, యూటీఎఫ్ డిమాండ్ చేశాయి. 2022-2023 విద్యాసంవత్సరంలో పదో తరగతి మూల్యాంకన వేతన బకాయిలు ఇంతవరకు చెల్లించకపోవడం శోచనీయమని ఆయా సంఘాల నాయకులు పేర్కొన్నారు. వెంటనే వాటిని చెల్లించాలని డిమాండ్ చేశారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోనంకి అశోక్‌కుమార్, జిల్లా అధ్యక్షప్రధానకార్యదర్శులు శ్రీనివాసులు, ఆర్ చంద్ర, గౌరవాధ్యక్షుడు పీవీ మాధవ తదితరులు సోమవారం ఆర్జేడీ రాఘవరెడ్డికి స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన మూల్యాంకన కేంద్రంలో వినతిపత్రం అందజేశారు. యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్, కార్యదర్శి లక్ష్మీనారాయణ, నాయకులు కూడా అక్కడే డీఈఓ మీనాక్షికి వినతి ఇచ్చారు. వారు మాట్లాడుతూ.. జిల్లావ్యాప్తంగా వేతన బకాయిలు రూ.23 లక్షలు చెల్లించాల్సి ఉందన్నారు. ఏడాది గడిచినా ప్రభుత్వం రెమ్యూనేషన్ చెల్లించకపోవడం సమంజసం కాదన్నారు. పాతది చెల్లించకుండానే తిరిగి స్పాట్‌కి తమకు ఎలా నియమిస్తారని మండిపడ్డారు.

తాగునీటి కోసం రోడ్డెక్కిన ప్రజలు

● 300 ఇళ్లకు నీటి కష్టాలు

● ఎమ్మెల్యే సొంతమండలంలోనే నీటి ఎద్దడి

నల్లమాడ, ఏప్రిల్ 1: మండల కేంద్రంలోని పుట్టపర్తి, కదిరి ప్రధాన రహదారిలో ప్రజలు తాగునీటి సమస్య పరిష్కరించాలని సోమవారం రోడ్డెక్కారు. ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ పరిధిలో రోడ్డు కిరువైపులా 300 ఇళ్లు ఉన్నాయని, నెలరోజుల నుంచి తాగునీటి కోసం ఇబ్బంది పడుతున్నామని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే సొంత మండలంలోనే తాగునీటి కోసం ప్రజలు ఇబ్బంది పడుతున్నా పట్టించుకున్న పాపాన పోలేదని వాపోయరు. సమస్యను పరిష్కరించాలని పంచాయతీ అధికారులకు మొరపెట్టుకున్నా స్పందించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆంధ్రప్రగతి బ్యాంకు వద్ద ఉన్న బోరు చెడిపోవడం సమస్యగా మారిందన్నారు. నల్లమాడ క్రాస్ వద్ద నున్న బోరుబావి నుంచి మూడు రోజులకు ఒకసారి పంచాయతీ అధికారులు నీటిని వదిలేవారన్నారు. ఆ బోరులో నీరు అడుగంటిపోవడంతో క్రాస్ వద్దనున్న కాలనీవాసులు గేట్‌వాల్‌ను ఈ కాలనీవైపు తిప్పకూడదని చెప్పడంతో పంచాయతీ కార్మికులకు చెప్పడంతో వారు నీటిని నిలిపివేశారన్నారు. దీంతో నెలరోజులుగా తాగునీరు లేక అల్లాడిపోతున్నామన్నారు. విషయం తెలుసుకున్న ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ శశికళ సంఘటనా స్థలానికి చేరుకుని, మహిళలతో మాట్లాడుతూ రెండు మూడు రోజుల్లో కాలనీలో ఉన్న బోరుకు మరమ్మతు చేయించి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. దీంతో కాలనీవాసులు ఆందోళన విరమించారు.



పుట్టపర్తి-కదిరి రహదారిపై ఉంచిన ఖాళీ బిందెలు

నిధులు లేక.. డ్రామాలకు తెర లేపారు

● రాష్ట్ర ప్రభుత్వంపై పరిటాలశ్రీరామ్ మండిపాటు


సమావేశంలో మాట్లాడుతున్న పరిటాల శ్రీరామ్

ధర్మవరం, ఏప్రిల్ 1: పింఛన్లు పంపిణీ చేసేందుకు నిధులు లేవని, అయితే దీన్ని కప్పిపుచ్చుకోవడానికి టీడీపీ ఏదో చేసినట్టు వైసీపీ ప్రభుత్వం కొత్త డ్రామాలకు తెర లేపిందని టీడీపీ ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ మండిపడ్డారు. అనంతపురంలోని తన నివాసంలో సోమవారం ఆయన టీడీపీ, బీజేపీ ముఖ్య నాయకులతో సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. సీఎం జగన్ పింఛన్లకు సంబంధించిన నిధులను కాంట్రాక్టర్లకు దోచి పెట్టారని, దీంతో పింఛన్‌దారులకు పంపిణీ చేయడానికి డబ్బులు లేవని, దీన్ని కప్పిపుచ్చుకోవడానికి సీఎం జగన్ వలంటీర్లను దూరం పెట్టడంతోనే ఆలస్యమవుతోందని చెప్పడం విడ్డూరంగా ఉందని పేర్కొన్నారు. కొత్తనాటకానికి తెరలేపి.. దీనిని ఎన్నికలలో ఉపయోగించుకునే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. మార్చి 16 నుంచి 30వ తేదీల మధ్య 15 రోజుల్లోనే ఎన్నికల కోడ్‌కు విరుద్ధంగా సీఎం సొంత కాంట్రాక్టర్లకు ఆ నిధులను దోచిపెట్టారని విమర్శించారు. ఒకటవ తేదీన పింఛన్లు పంపిణీ చేయకపోవడానికి నిధుల కొరతే కారణమన్నారు. ఆన్‌లైన్ విధానంలో కానీ.. ప్రభుత్వ ఉద్యోగులతో కానీ వెంటనే పింఛన్లు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. వలంటీర్లకు తాము వ్యతిరేకంగా కాదని ఈ సందర్భంగా ఆయన స్పష్టంచేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వలంటీర్లను కొనసాగిస్తామన్నారు. పొత్తులో భాగంగా ధర్మవరం టిక్కెట్ బీజేపీకి కేటాయించిన నేపథ్యంలో ఎలా ముందుకెళ్లాలన్న దానిపై దృష్టిసారించామన్నారు. ఈ క్రమంలో బీజేపీ నాయకులతో కలిసి సమావేశాన్ని కూడా నిర్వహిస్తున్నామన్నారు. 4వ తేదీన బీజేపీ అభ్యర్థి సత్యకుమార్ ధర్మవరానికి రానున్న నేపథ్యంలో అందుకు సంబంధించిన ఏర్పాట్లపై సమాలోచనలు చేశామన్నారు. ధర్మవరంలో జనసేన కూడా బలంగా ఉన్న నేపథ్యంలో ఆ పార్టీని కూడా కలుపుకుని ముందుకు వెళ్లామని నిర్ణయించామన్నారు. కార్యక్రమంలో టీడీపీ, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

డబ్బులేకనే.. పింఛన్ల పంపిణీ జరగలేదు

● పింఛన్ల సొమ్మును సీఎం తన కాంట్రాక్టర్లకు దోచిపెట్టారు

● మాజీమంత్రి పల్లె రఘునాథరెడ్డి


విలేకరులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి పల్లె

పుట్టపర్తి, ఏప్రిల్ 1: పెన్షన్ సొమ్ముతో పాటు ప్రభుత్వ నిధులు రూ. 13వేల కోట్లను గత మార్చినెలలో ఎన్నికల కోడ్‌కు విరుద్ధంగా సీఎం జగన్‌రెడ్డి తన సొంత కాంట్రాక్టర్లకు దోచిపెట్టారని మాజీమంత్రి పల్లె రఘునాథరెడ్డి విమర్శించారు. పట్టణంలోని తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సీఎం జగన్ ప్రభుత్వ సొమ్మును తన కాంట్రాక్టర్లకు అప్పనంగా పంచిపెట్టారని మండి పడ్డారు. ఈనెల 1వ తేదీన లబ్ధిదారులకు పింఛన్ రాకపోవడానికి కారణం జగన్‌రెడ్డి ప్రభుత్వ ఖజానాను ఖాళీ చేసినందుకేనన్నారు. సీఎం స్వార్థ రాజకీయాల వలన పింఛన్ దారులు, వలంటీర్లు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి అధికారంలోకి రాగానే ఇంటి వద్దకే నెలకు నాలుగువేలు పింఛన్ అందిస్తామని పేర్కొన్నారు. పింఛన్ల పంపిణీ ఏప్రెల్ 1న జరగకుండా టీడీపీ అడ్డుకుంటోందంటూ వైసీపీ చేస్తున్న ప్రచారం పూర్తిగా అవాస్తవమన్నారు. ప్రజలకు ఇవ్వాల్సి డబ్బులను సొంత కాంట్రాక్టర్లకు దోచిపెట్టడంతో ఖజానా ఖాళీ అయిందని, అందువల్లే పింఛన్లు పంపిణీ చేయలేకపోతున్నారని తెలిపారు. అవినీతి, అక్రమాలు, దోపిడీలు, దౌర్జన్యాలకు కేరాఫ్ వైసీపీని, ఎన్నికల్లో ప్రజలు ఓటుద్వారా ఆ పార్టీకి తగిన బుద్ధి చెప్పాలని పల్లె కోరారు.


టీడీపీలో చేరిన తనకల్లు మండల వాసులతో కందికుంట

టీడీపీలోకి 20 కుటుంబాల చేరిక

తనకల్లు, ఏప్రిల్ 1: మండలంలోని ఈతోడు గ్రామానికి చెందిన 20 కుటుంబాల వారు సోమవారం తలుపుల మండలంలో కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కందికుంట వెంకటప్రసాద్‌ను కలిసి టీడీపీలోకి చేరారు. వారికి ఆయన కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి గెలుపుకోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. పార్టీలో చేరిన వారందరినీ తన కుటుంబ సభ్యులుగా భావించి ఆదరిస్తానన్నారు. చేరినవారిలో వేణుగోపాల్, గుంజువారిపల్లి నల్లప్ప, ఈ. కిష్టప్ప, దవణం రామప్ప, రామదాసు,పలక గంగన్న, రాము తదితరులు ఉన్నారు. కార్య క్రమంలో మండల ప్రధాన కార్యదర్శి నాగేంద్రప్రసాద్, నాయకులు సుంకర మురళి, ఒటెండ్లు కిష్టప్ప, సోమశేఖర్, చిన రామిరెడ్డి, రామచంద్ర, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

15కుటుంబాలు చేరిక..

గాండ్లపెంట: మండలంలోని గాజులవారిపల్లి పెద్ద తండా, నల్లగుట్టతండాల నుంచి 15 కుటుంబాల వారు వైసీపీని వీడి టీడీపీలోకి చేరారు. మాజీ ఎంపీటీసీ వెంకటరమణ ఆధ్వర్యంలో సోమవారం వారు కదిరి పట్టణంలోని టీడీపీ అభ్యర్థి కంది కుంట వెంకటప్రసాద్ నివాసంలో ఆయన సమక్షంలో పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. చేరిన వారికి కందికుంట కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. చేరినవారిలో భాస్కర్‌రెడ్డి, సుధాకర్, రామక్రిష్ణనాయక్, శ్రీకాంత్, హరినాయక్, దీప్లానాయక్, ఆంజనేయులు తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ కొండయ్య, క్లస్టర్ ఇన్‌చార్జి ప్రసాద్, మాజీ సర్పంచ్ కాకర్ల రవీంద్రారెడ్డి, నాయకులు ఎంజీనాయక్, పవన్‌కుమార్, శ్వేత, తదతరులు పాల్గొన్నారు.


టీడీపీలో చేరిన గాండ్లపెంట మండల వాసులతో ..

తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు చేపట్టండి

● ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి

పుట్టపర్తి, ఏప్రిల్ 1: వేసవిలో ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి.. జిల్లా అధికారులను ఆదేశించారు. అమరావతి నుంచి సోమవారం వీడియో కాన్ఫరెన్సు ద్వారా అధికారులతో సమీక్ష నిర్వహించారు. స్థానిక కలెక్టరేట్‌లోని వీడియోకాన్ఫరెన్సు హాల్ నుంచి కలెక్టర్ అరుణ్‌బాబు ఇతర అధికారులు పాల్గొన్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ.. ఎండతీవ్రత పెరిగిందనీ, వడగాల్పులపై ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. తాగునీరు, విద్యుత్ సరఫరాలో ఎక్కడ సమస్య తలెత్తినా వెంటనే పరిష్కార చర్యలు చేపట్టాలన్నారు. కూలీలకు ఉపాధిహామీ పనులు విస్తృతంగా కల్పించాలన్నారు. పింఛన్ల పంపిణీ సజావుగా చేపట్టాలన్నారు. జిల్లాలో తాగునీటి సరఫరాకు తీసుకుంటున్న చర్యలపై కలెక్టర్ వివరించారు. కార్యక్రమంలో జేసీ అభిషేక్ కుమార్, డీఆర్వో కొండయ్య, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, డ్వామా పీడీ విజయేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

ఈతకు వెళ్లి యువకుడి మృతి

బత్తలపల్లి, ఏప్రిల్ 1: మండలంలోని గరిశనపల్లిలో ఓ యువకుడు ఈతకు వెళ్లి మృతి చెందాడు. గ్రామస్థులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన కృష్ణారెడ్డి కుమారుడు మణికంఠరెడ్డి (22) వ్యవసాయం పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. కాగా సోమవారం మధ్యాహ్నం మిత్రులతో కలిసి గ్రామసమీపంలోని చిత్రా వతి నది లోకి ఈతకు వెళ్లాడు. అక్కడ లోతు ఎక్కువ ఉన్న ప్రాంతంలోకి వెళ్లి ప్రమాదవశాత్తూ మునిగిపోయాడు. మిత్రులు గ్రామంలోకి వచ్చి కుటుంబ సభ్యులకు విషయం తెలిపారు. వెంటనే వారు గ్రామస్థులతో వచ్చి గుంటలో రెండు గంటలసేపు గాలించి మణికంఠను బయటికి తీశారు. అయితే అప్పటికే అతను మృతి చెందాడు. కుటుంబ సభ్యులు బోరున విలపించారు.

కూటమి గెలుపు కోసం కృషి : వడ్డెర్లు

నల్లమాడ, ఏప్రిల్ 1: వచ్చే ఎన్నికల్లో టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి గెలుపు కోసం తాము కృషి చేస్తామని వడ్డెర సంఘం నియోజకవర్గ ఆర్గనైజింగ్ కార్యదర్శి పల్లపు ప్రతాప్ పేర్కొన్నారు. మండలకేంద్రంలోని నాగలకట్ట వద్ద సోమవారం ఆయన వడ్డెర నాయకులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. నియోజకవర్గంలోని వడ్డెర్లందరూ టీడీపీలోనే ఉన్నామన్నారు. కూటమి అభ్యర్థి పల్లె సింధూరారెడ్డి విజయం కోసమే పని చేస్తామని పేర్కొన్నారు. చంద్రబాబును ముఖ్యమంత్రిగా చేసుకుంటామని తెలిపారు. అన్నిగ్రామాలు తిరిగి కూటమి గెలుపుకోసం కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో పీ.గంగులప్ప, పీ. కృష్ణ, పీ.విశ్వనాథ్, కే. గంగరాజు, కే. రమణ, బీ. శేఖర్, ఎస్. నారాయణస్వామి, డీ. రాజు పాల్గొన్నారు.

క్రేన్ బోల్తా... డ్రైవర్ మృతి

ముదిగుబ్బ, ఏప్రిల్ 1: మండలంలోని దొరిగిల్లు ఘాట్ రోడ్డులో సోమవారం క్రేన్ బోల్తాపడడంతో డ్రైవర్ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. కడప జిల్లా ప్రొద్దుటూరు వైపు నుంచి ముదిగుబ్బ వైపునకు వస్తున్న క్రేన్ దొరిగిల్లు ఘాట్‌రోడ్ మలుపు వద్ద అదుపు తప్పి బోల్తాపడింది. ప్రమాదంలో క్రేన్ డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. మృతుడి వివరాలు పోలీసుల దర్యాప్తులో తెలియాల్సి ఉంది.

గడ్డివామి దగ్ధం

నంబులపూలకుంట, ఏప్రిల్ 1: మండలంలోని మల్లక్కగారిపల్లిలో వేరుశనగ గడ్డి వామి ఆదివారం రాత్రి దగ్ధమైంది. బాధితుడు వెంకటమల్లయ్యనాయుడు సోమవారం మాట్లాడుతూ పశు గ్రాసాన్ని రూ. లక్ష 30 వేలు పెట్టి కొనుగోలు చేసి, వామిని ఏర్పాటు చేశానన్నారు. ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో పూర్తిగా కాలిబూడిదైనట్లు చెప్పారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

చలివేంద్రం ప్రారంభం

నంబులపూలకుంట, ఏప్రిల్ 1: మండలకేంద్రంలోని నాగలకట్ట వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని తహసీల్దార్ నరేంద్రకుమార్, ఎంపీడీఓ ఆదినారాయణ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత మూడురోజుల నుంచి ఎండలు తీవ్రంగా ఉన్నాయన్నారు. బాటసారుల దాహార్తి తీర్చేందుకు ఈ చలివేంద్రాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. మండలంలోని సచివాలయాల వద్దకూడా చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని ఎంపీడీఓ సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో కార్యదర్శి రమేష్, వీఆర్వో కిష్టప్ప తదితరులు పాల్గొన్నారు.


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

సూపర్‌సిక్స్ పథకాలపై విస్తృత ప్రచారం


తారకరామనగర్‌లో ప్రచారం చేస్తున్న సామకోటి ఆదినారాయణ


కొక్కంటి వారిపల్లిలో టీడీపీ నాయకుల ప్రచారం

పుట్టపర్తి రూరల్, ఏప్రిల్ 1: మున్సిపల్ పరిధిలోని తారకరామనగర్‌లో సోమవారం టీడీపీ జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ సూపర్ సిక్స్ పథకాలపై విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరుగుతూ చంద్రబాబు ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాల గురించి ప్రజలకు వివరించారు. చంద్రబాబు సీఎం అయితే అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు చెన్నప్ప, నరసింహులు, గంగాద్రి, రామకృష్ణ, బాషా, బాలాజీ, నారాయణస్వామి, వెంకట్రాముడు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

కొక్కంటివారిపల్లిలో..

ఓబుళదేవరచెరువు: మండలంలోని అల్లాపల్లి పంచాయతీ కొక్కంటివారిపల్లి గ్రామంలో టీడీపీ నాయకుడు బోయపల్లి శివారెడ్డి, పీవీ రమణ, ఆర్ఎంపీ కృష్ణమూర్తి, బూత్ కన్వీనర్ శివనారాయణ తదితరులు సూపర్ సిక్స్ పై ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఇంటింటా తిరిగి సూపర్‌సిక్స్ పథకాల గురించి ప్రజలకు కరపత్రాలు పంచుతూ వివరించారు. రానున్న ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటు వేసి టీడీపీని గెలిపించాలని కోరారు. నాయకులు ఆటో ప్రభాకర్, శంకర్, శ్రీనివాసులు, సుధాకర్ పాల్గొన్నారు.

అన్యాక్రాంత భూములను పరిరక్షించండి

● ఆర్డీఓకు సీపీఎం నాయకుల వినతి


ఆర్డీఓ భాగ్యరేఖకు వినతిపత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు

పుట్టపర్తి రూరల్, ఏప్రిల్ 1: జిల్లాకేంద్రంతో పాటు మండలపరిధిలో అన్యాక్రాంతమవుతున్న ప్రభుత్వ భూములను పరిరక్షించాలంటూ సీపీఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఈఎస్ వెంకటేసు కోరారు. ఈ మేరకు సోమవారం వారు జిల్లాకేంద్రంలో ఆర్డీఓ భాగ్యరేఖను కలిసి వినతి పత్రం అందజేశారు. జిల్లాకేంద్రం పరిధిలోని ఎనుములపల్లి సర్వేనెంబర్ 454-2, 454-3, 454-6,లలో 7ఎకరాల 66 సెంట్లు విస్తీర్ణం గల భూమిని ఓవ్యక్తి అక్రమించి అందులో స్విమ్మింగ్‌ఫూల్, పెద్దపెద్ద భవనాలను అనుమతిలేకుండా నిర్మించారని, వీటిపై సమగ్ర విచారణ జరిపి ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకోవాలని కోరారు. అలాగే కప్పలబండ పొలం సర్వేనంబర్ 308లో ఉన్న 21ఎకరాల 42 సెంట్ల భూమిని సైతం భూకబ్జాదారులు ఆక్రమించారని , వీటిని కూడా స్వాధీనం చేసుకుని భూకబ్జాదారులపై కేసులు నమోదు చేయాలని విన్నవించారు. చిత్రావతి నదీపరివాహకప్రాంతంలో అక్రమంగా నిర్మించిన భవనాలను తొలగించాలని సుప్రీం కోర్టు తీర్పునిచ్చిందని, తీర్పును వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. సదరు భూఅక్రమణలపై కలెక్టర్, డీఆర్ఓ, పుడాలకు మెమొరాండం సమర్పించామని తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు బ్యాళ్లఅంజి, రామకృష్ణ, సిద్దు పాల్గొన్నారు.

ముందస్తు అరెస్టులు హేయం

● తెలుగుయువత, టీఎన్‌ఎస్ఎఫ్ నాయకుల మండిపాటు


అరెస్టు అయిన టీఎన్‌ఎస్ఎఫ్, తెలుగు యువత నాయకులు

కదిరిఅర్బన్, ఏప్రిల్ 1: ముఖ్యమంత్రి జగన్ బస్సు యాత్రలో భాగంగా సోమవారం కదిరికి వస్తున్న నేపథ్యంలో పోలీసులు స్థానిక తెలుగుయువత, టీఎన్‌ఎస్ఎఫ్ నాయకులను ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఇందుకు పలువురు నాయకులు మాట్లాడుతూ.. జగన్‌కు ఓటమి భయపట్టుకుందని, పోలీసులను అడ్డంపెట్టుకుని ప్రతిపక్ష పార్టీల నాయకులను ముందస్తుగా అరెస్టు లు చేయించారని మండిపడ్డారు. ఈ ముందుస్తు అరెస్టులు హేయమైన చర్యగా అభివర్ణించారు. ఒక్క ఛాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన ఆయన ప్రజల నడ్డివిరిచారని చెప్పారు. ప్రజలు గమనిస్తున్నారని త్వరలోనే జగన్‌కు బుద్ధి చెబుతారని అన్నారు. అరెస్టు అయిన వారిలో తెలుగుయువత నాయకులు బాబ్‌జాన్, హరి, ప్రవీణ్‌కుమార్, తాజుఖాన్, వినోద్, టీఎన్ఎస్ఎఫ్ నాయకులు సల్మాన్‌ఖాన్, రోషన్, లోకేష్‌నాయుడు, ప్రవీణ్, అనిల్ తదితరులు ఉన్నారు.

పాపం మూగజీవాలు..

● గ్రాసం, నీటి కొరతతో విలవిల

నంబులపూలకుంట, ఏప్రిల్ 1: ప్రస్తుతం ఎండలు మండుతున్నాయి. ఈ సారి వర్షాలు సమృద్ధిగా కురవకపోడంతో అరకొరగా ఉన్న భూగర్భజలాలు అడుగంటిపోయాయి. కుంటలు, చెరువుల్లో సైతం నీటి సామర్థ్యం పూర్తిగా అడుగంటిపోయింది. వ్యవసాయ బోర్లలో చుక్క నీరు రావడం లేదు. దీంతో పాడి రైతులు పశువుల దాహార్తిని తీర్చడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పశువులు గ్రాసం కోసం కొండలు, బీళ్లు తిరిగినా పట్టెడు గడ్డి దొరకడం లేదు. మండలంలోని పలు గ్రామాల్లో రైతులు పశువులకు కొండల్లో, పొలాల్లో ఏమైనా గ్రాసం దొరుకుతుందేమోనని ఉదయాన్నే వాటిని సమీప కొండల్లోకి.. పొలాల్లోకి తోలుతున్నారు. అయితే ఈ ఎండలకు ఎక్కడా ఓ పాస గ్రాసం కూడా దొరికే పరిస్థితి లేదు. దీంతో ఊసూరుమంటూ మధ్యాహ్నం 12 గంటలు కాకనే అవి ఖాళీ కడుపుతోనే ఇళ్లకు చేరుకుంటున్నాయి. కనీసం కడుపునిండా నీటిని తాపుదామన్నా.. నీరు దొరికే పరిస్థితి లేదు. దీంతో పాడి రైతులు ఆవేదన చెందుతున్నారు. గ్రాసం, నీరు లేకపోతే పశువులను ఎలా బతికించుకోవాలని వాపోతున్నారు. ప్రభుత్వం స్పందించి పశువులకు గ్రాసం, నీటి వసతి కల్పించాలని కోరుతున్నారు.


పెడబల్లి వద్ద గ్రాసం కోసం అడవికి వెళ్తున్న పశువులు

ఆటో బోల్తా.. పాత్రికేయులకు తీవ్ర గాయాలు

ముదిగుబ్బ, ఏప్రిల్ 1: ఆటో అదుపుతప్పి బోల్తా పడడంతో ఇద్దరు పాత్రికేయులకు తీవ్ర గాయాలవగా, మరో ఇద్దరు ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. కదిరిలో సోమవారం జరిగిన సీఎం జగన్ బస్సు యాత్ర కార్యక్రమాన్ని కవర్ చేసేందుకు ఆర్ టీవి స్టాఫర్ చల్లా కేనాయుడు, ఫొటో గ్రాఫర్ సుధాకర్ వెళ్లారు. కవరేజీ అనంతరం వారు ఆటోలో తిరిగి అనంతపురానికి బయలుదేరారు. ముదిగుబ్బ మండలం ఎన్ఎస్‌పీ కొట్టాల సమీపంలో ఆటో ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి అదుపుతప్పి బోల్తా పడింది. ప్రమాదంలో చల్లా కేనాయుడి, సుధాకర్‌కు తీవ్రగాయాలయ్యాయి. మరో ఇద్దరు ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు 108 వాహనంలో కదిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చల్లాకేనాయుడును మెరుగైన వైద్యం కోసం కుటుంబ సభ్యులు అనంతపురం తరలించారు.


రోడ్డు ప్రమాదంలో గాయపడిన పాత్రికేయుడు

అమడగూరు సర్పంచ్ చేరిక ..


టీడీపీ తీర్థం పుచ్చుకుంటున్న సర్పంచు షేక్ షబ్బీర్

పుట్టపర్తి, ఏప్రిల్ 1: వైసీపీ పాలనలో సర్పంచులు దిష్టిబొమ్మలేనని ఎన్నుకున్న ప్రజలకు న్యాయం చేయలేకపోయామంటూ టీడీపీ తీర్థం పుచ్చుకున్న అమడగూరు సర్పంచు షేక్ షబ్బీర్ పేర్కొన్నారు. జిల్లాకేంద్రంలోని టీడీపీ కార్యాలయంలో సోమవారం రాత్రి ఆయన మాజీ మం త్రి పల్లె రఘునాథరెడ్డి సమక్షంలో టీడీపీలోకి చేరారు. ఆయనకు పల్లె పార్టీ కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు. అలాగే కొట్టువారిపల్లి ఉపసర్పంచ్ జనార్థన్‌రెడ్డి కూడా టీడీపీలోకి చేరారు. ఈ సందర్భంగా అమడగూరు సర్పంచ్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో సర్పంచ్‌లకు ఎలాంటి విలువ లేదన్నారు. పల్లె మాట్లాడుతూ సీఎం జగన్ సర్పంచులతో పాటు ఎంపీటీసీలు, జడ్పీటీసీలకు కూడా ఎలాంటి గుర్తింపు ఇవ్వలేదన్నారు. కార్యక్రమంలో మండలకన్వీనర్ కృష్ణమూర్తి, గోపాల్‌రెడ్డి,కుమార్‌రెడ్డ, బోడెప్ప, అంజి, సుధాకరరెడ్డ, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి కొరత లేకుండా చూడాలి


మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ రాంకుమార్

ధర్మవరం, ఏప్రిల్ 1: మున్సిపాలిటీ పరిధిలో తాగు నీటి కొరత లేకుండా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులు, సిబ్బందికి మున్సిపల్ కమిషనర్ రాంకుమార్ ఆదేశాలిచ్చారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ సమావేశ భవనంలో సోమవారం ఆయన వాటర్‌సప్లై సిబ్బంది, ఇంజనీరింగ్ విభాగపు అధికారులతో సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. పట్టణంలోని 40 వార్డులలోనూ నీటికొరత లేకుండా చూడాలన్నారు. ఎక్కడైనా సమస్య తలెత్తితే ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. ప్రతి రోజూ వార్డుల వారీగా షెడ్యూల్ ప్రకారం నీటిని సరఫరా చేయాలన్నారు. పంపింగ్ యంత్రాలు మరమ్మతులకు గురైతే వాటిని వెంటనే బాగు చేయించాలన్నారు. ప్రజలు నీటి ఎద్దడి గురించి సచివాలయాల్లో కూడా ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. ప్రజలు నీటిని వృథాచేయరాదని, పొదుపుగా వాడుకోవాలని తెలిపారు. సమావేశంలో అసిస్టెంట్ కమిషనర్ మధుసూదన్‌రెడ్డి, ఇంజనీరింగ్ విభాగపు ఈఈ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మట్టి మాఫియాను అరికట్టండి


మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్

పుట్టపర్తి, ఏప్రిల్ 1: ఉమ్మడి అనంతపురం జిల్లాలో మట్టి మాఫియాను అరికట్టాలంటూ సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్ డిమాండ్ చేశారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో సోమవారం విలేకరులతో ఆయన మాట్లాడారు. టెండర్ దా రులు రెండు నెలల్లోనే టెండ ర్లు తగ్గించుకుని రూ. మూడు కోట్ల మేర ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టారన్నారు. అనుమతులు లేకుండా యథేచ్ఛగా మట్టి దోపిడీ జరుగుతోందన్నారు. విజిలెన్స్ అధికారులు నెలవారి మామూళ్లతో మట్టిమాఫియాకు తెర లేపారన్నారు. దీనిపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి జేవీ రమణ, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా

ఆంధ్రజ్యోతి స్పందన

నంబులపూలకుంట, ఏప్రిల్ 1: మండలంలోని రామాపురం తండాలో గత పది రోజులుగా తీవ్ర తాగునీటి ఎద్దడి నెలకొంది. దీంతో ప్రజలు ఇబ్బంది పడుతుండడంపై ఆంధ్రజ్యోతి దినపత్రిలో సోమవారం రామాపురం తండాలో తాగునీటి ఎద్దడి అన్న కథనం ప్రచురితమైంది. ఈ వార్తకు స్పందించిన ఎంపీడీఓ ఆదినారాయణ వెంటనే తండాలో నీటి ట్యాంకర్ల ద్వారా తాగునీటి అందించి సమస్యను తాత్కాలికంగా పరిష్కరించారు. శాశ్వత పరిష్కారం కోసం నూతన బోరు వేయడానికి ప్రతిపాదనలు పంపినట్లు ఆయన చెప్పారు.


రామాపురం తండాలో ట్యాంకర్ ద్వారా నీటిని సరఫరా చేస్తున్న దృశ్యం

పెండింగ్ బిల్లులు రూ.2.53కోట్లు మంజూరు

గోరంట్ల, ఏప్రిల్ 1: మండల వ్యాప్తంగా 20 పంచాయతీల్లో పెండింగ్ బిల్లులకు సంబంధించి రూ.2.53కోట్లు సీఆర్ఎఫ్ నిధులు మంజూరైనట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ముజమీల్ తెలిపారు. గోరంట్లతోపాటు పలు గ్రామాల్లో నీటి వసతి కల్పించడానికి 2019-20లో ట్యాంకర్ల ద్వారా సరఫరా చేశారు. అప్పటినుంచి నిధులు మంజూరుకాక పోవడంతో బిల్లుల చెల్లింపులు ఆగిపోయాయి. ప్రస్తుతం ఎన్నికలు సమీపిస్తుండడంతో 176 పనులకు రూ2.53 కోట్లు నిధులను ప్రభుత్వం విడుదల చేసింది.

కోనేరును పునరుద్ధరిస్తాం : పరిపూర్ణానందస్వామి



మాట్లాడుతున్న పరిపూర్ణానంద స్వామీజీ

హిందూపురం అర్బన్, ఏప్రిల్ 1: హిందూపురంలో గణేశ్ నిమజ్జనం కోసం కోనేరును పునరుద్ధరిస్తామని శ్రీపీఠం పీఠాధిపతి పరిపూర్ణానందస్వామి పేర్కొన్నారు. ఆయన సోమవా రం స్థానిక గుడ్డం ఆలయం వద్ద విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గణేశ్ నిమజ్జనానికి తగ్గట్లుగా ఇక్కడి కోనేరును ఏర్పాటు చేయాలని 43 ఏళ్లుగా ప్రజలు ప్రభుత్వాలు పట్టించుకోలే దన్నారు. ఈ సారి ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా కోనేరును అభివృద్ధి చేయాలన్నారు. పురం అభివృద్ధికే సిద్ధపడి ఆనే కార్యక్రమంలో భాగంగా (ఏదు అంశాలతో) ప్రణాళిక రూపొం దించనున్నారు. ఇందులో భాగంగా ముందు కోనేరును పునరుద్ధరించాలన్నారు. లేని పక్షంలో దేశ విదేశాల్లో ఉన్న తన భక్తుల సహకారంతో నిర్మిస్తానన్నారు. ఇందులో భాగంగా సోమవారం కోనేరుకు పూజ చేశారు.

ఎన్ఎస్‌యూఐ జాతీయ కార్యదర్శిగా సంపత్



సంపత్‌కుమార్

హిందూపురం, ఏప్రిల్ 1: ఎన్ఎస్‌యూఐ జాతీయ కార్యదర్శిగా హిందూపురం పట్టణానికి చెందిన తనను ఎంపిక చేసినట్లు విద్యార్థి సంఘం నాయకుడు సంపత్ కుమార్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఏఐఎస్ఎఫ్ పట్టణాధ్యక్షుడిగా ఉన్న తాను 2018లో ఎన్ఎస్ యూఐ జిల్లా కార్యదర్శిగా, 2019లో ప్రధాన కార్యదర్శిగా, హిందూపురం పట్టణ విద్యార్థి సంఘం జేఏసీ అధ్యక్షుడి గా ఎంపికైనట్లు తెలిపారు. ఆలాగే 2020లో ఎన్ఎస్ యూఐ జాతీయ సమన్వయకర్తగా ప్రస్తుతం జాతీయ కార్యదర్శిగా అంచెలంచెలుగా ఎదిగానన్నారు.

ఆసుపత్రికి మంచాల వితరణ

గోరంట్ల, ఏప్రిల్ 1: పట్టణంలోని సామాజిక ఆరోగ్య కేంద్రానికి కియ పరిశ్రమ సంస్థ నుంచి రోగుల సౌకర్యం మంచాలు, పరుపులు అందజేశారు. ఆసుపత్రికి పది ఇనుప మంచాలు, పది పరుపులు, రెండు స్ట్రెచర్లు, మూడు వీల్ ఛైర్లు, కార్డియాక్ మానిటర్లను సోమవారం అందించారు. పట్టణంలోని ఆసుపత్రి సీహెచ్‌సీ ఆయిన పటికి అందులో తువ్వపద్దెన ఐదు మంచాలను పరుపులు లేకుండా వినియోగించేవారు. వైద్యాధికారుల సూచన మేరకు కియ పరిశ్రమ నిర్వాహకులు పై సామాగ్రిని స్వయంగా తీసుకొచ్చి సిబ్బందికి అందించారు. ఆవసరాన్ని గుర్తించి ఆసుపత్రికి మరో 14 మంచాలు, 14 పరుపులు త్వరలో సమకూర్చ దానికి కియా పరిశ్రమ వారు అంగీకరించినట్లు వైద్యసిబ్బంది తెలిపారు.

టీడీపీ కార్యకర్త మృతికి సంతాపం

రొద్దం, ఏప్రిల్ 1: మండలంలోని రాచూరు గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త మేకల వెంకటరెడ్డి (65) గుండెపోటుతో ఆదివారం అర్ధరాత్రి మృతిచెందారు. టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సవిత, హిందూపురం పార్లమెంట్ అభ్యర్థి బీకే పార్థసారధి సతీమణి కమలమ్మ సోమవారం గ్రామానికి వెళ్లి నివాళు లర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారి వెంట టీడీపీ నాయకులు మాదవనాయుడు, టైలర్ అంజనేయులు, నరసింహులు, నాగభూషణం, మనోహర్, వెంకటరెడ్డి, నరసింహారెడ్డి, రామచంద్ర తదితరులు ఉన్నారు.

గాయపడిన రిటైర్డ్ ఉపాధ్యాయుడి మృతి



నాగప్ప (ఫైల్)

గోరంట్ల, ఏప్రిల్ 1: మండలంలోని నిషాగ్నాన్పల్లి పరిశ్రమ వద్ద ద్విచ క్రవాహనా లు ఢీకొన్న సంఘటనలో గాయపడిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు నాగప్ప(66)ను ఆదివారం రాత్రి 108లో హిందూపురం తీసుకెళ్తుండగా మృతిచెందిన ట్లు సీఐ సుబ్బరాయుడు తెలిపారు. పుట్టపర్తి రహదారిలో జరిగిన ద్విచక్రవాహన ప్రమాదంలో పుట్టగుండ్లపల్లి వలంటీర్ వినోద్‌కుమార్(28) గోరంట్ల ఆసుపత్రిలో మృతిచెందిన విషయం తెలిసిందే. తీవ్రంగా గాయపడిన నాగప్పను గోరంట్ల ఆసుపత్రిలో చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం హిందూపురం తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందినట్లు పురం ఆసుపత్రిలో వైద్యులు తెలిపారు. ఆసుపత్రిలో సోమవారం మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు. వినోద్ శవానికి పెనుకొండ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్ పుట్టగుండ్లపల్లి కెళ్లి వలంటీర్ కుటుంబాన్ని పరామర్శించారు. మృతుడు నాగప్ప భార్య గతంలో మృతిచెందగా, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సవిత వెళ్లి నాగప్ప మృతదేహానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. ఆ కుటుంబాన్ని పరామర్శించారు.

ఆప్ నాయకుడి మృతికి నివాళి

పావగడ, ఏప్రిల్ 1: తమటే సంస్థ ఎడ్యుకేషన్ కోఆర్డినేటర్, ఆమ్ఆద్మీ పార్టీ నాయకుడు కన్నమేడి గంగరాజు(42) గుండెపోటుతో సోమవారం మృతిచెందారు. ఐటు సంస్థలోనూ, ఆటు పార్టీ కార్యక్రమాల్లో ఎంతో చురుకుగా పనిచేసేవారని తమటే సంస్థ తాలూకా అధ్యక్షుడు వెంకటేష్ పేర్కొన్నారు. గంగరాజు మృతి పార్టీకి, సంస్థకు తీరనిలోటన్నారు. బొడ్డ సమాజం నాయకుడు పవళ్లి సుబ్బరాయుడు, ఆప్ నాయకులు గోపాల్, పవన్ తదితరులు కన్నమేడికి వెళ్లి సంతాపం వ్యక్తం చేశారు. మృతుడికి భార్య కుమారుడు, కుమార్తె ఉన్నట్లు బంధువులు తెలిపారు.

టీడీపీతోనే అభివృద్ధి అని జనం విశ్వాసం

పెనుకొండ ఎమ్మెల్యే అభ్యర్థి సవిత



పార్టీ శ్రేణులతో కలిసి అభివాదం చేస్తున్న సవిత

గోరంట్ల, ఏప్రిల్ 1: టీడీపీతోనే అభివృద్ధి సాధ్యమని ప్రజలు విశ్వసిస్తున్నారని, పూర్వ వైభవం కోసం పెనుకొండ కోటపై టీడీపీ జెండాను ఎగురవేయాలని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సవిత పేర్కొన్నారు. ఆమె సోమవారం గోరంట్లలోని పార్టీ కార్యాలయంలో రెండురోజులుగా పంచాయతీల వారీగా నా యకులు, కార్యకర్తల తో ఆమె సమీక్షించారు. అనంతరం మండలంలోని మల్లాపల్లిలో పర్యటించారు. టీడీపీ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి నరసింహప్ప ఆధ్వర్యంలో ఆమెకు సోమవారం ఘనస్వాగతం పలికారు. స్థానిక ఆంజనేయ స్వామి ఆలయంలో పూజలు నిర్వహించి, ఆమెకు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు పిరిజ్ బాషా, గంగిరెడ్డి, శశిధర్, చెన్నారెడ్డి, రామాంజనేయులు తదితరులున్నారు. అనంతరం పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఎమ్మెల్యే శంకర్ నారాయణ, వారి సోదరులు అక్రమాల కు, భూకబ్జాలకు పాల్పడ్డారని ఆరోపించారు. అడ్డు వచ్చిన వారు ఏపార్టీ వారైనా వారిపై కేసులు పెట్టడమేకాకుండా వేదిస్తున్నారని ఆరోపించారు. వైసీపీ అభ్యర్థి ఉష్మశ్రీచరణ్ ఐదుకు ఏమాత్రం తగ్గకుండా ప్రవర్తిస్తున్నారన్నారు. ప్రజలు స్వాగతతతో పాటు టీడీపీతే, తమతో అభివృద్ధి జరుగుతుందని అనిచి గ్రామాల్లో ప్రచారం పడుతున్నారన్నారు. కూటమి అభ్యర్థుల విజయానికి సమష్టిగా పని చేయాలన్నారు. ఈకార్యక్రమంలో కస్సిరర్ సోమశేఖర్, కక్కల రఘునాథ్‌రెడ్డి, బాలకృష్ణ చౌదరి, హంపయ్య, జనసేన సంతోష్, సురేష్, వెంకటేష్, తదితరులున్నారు.

టీడీపీలోకి పలువురి చేరిక

పెనుకొండ టౌన్: అధికార పార్టీ వైసీపీ తీరునచ్చక రోజు రోజుకు ఆ పార్టీలో అసంతృప్తులు పెరుగుతున్నారు. వైసీపీని వీడి టీడీపీలో చేరుతున్నారు. పలగి మండలం పెద్దిరెడ్డిపల్లికి చెందిన 20 కుటుంబాలు ఆదివారం టీడీపీలో చేరాయి. టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సవిత వారికి సోమవారం టీడీపీ స్థానిక కార్యాలయంలో కండువావేసి సాదరంగా ఆహ్వానించారు. ఒక్కఛాన్స్ పేరుతో సీఎం జగన్ రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలను నమ్మించి మోసం చేశారని ఆమె విమర్శించారు.

వైసీపీ ఎన్నికుట్రలు పన్నినా టీడీపీదే విజయం

టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సునీల్‌కుమార్



గుడిబండ మండలంలో ప్రచారం చేస్తున్న సునీల్‌కుమార్

మడకశిరటౌన్, ఏప్రిల్ 1: అధికార పార్టీ వైసీపీ ఎన్ని కుట్రలు పన్నినా వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశంపార్టీ అధికారంలోకి రావడాన్ని అడ్డుకోలేరని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సునీల్‌కుమార్ అన్నారు. ఆయన సోమవారం పట్టణంలోని పెనుకొండ రోడ్డులో పార్టీ ఎలక్షన్ క్యాంపెన్ నూతన కార్యాలయాన్ని మాజీ ఎమ్మెల్యే మద్దనకుంట ఈరన్నతో కలిసి ప్రారంభించారు. ఈసందర్భంగా సునీల్ కుమార్ మాట్లాడుతూ... వృద్ధులు, వికలాంగులు తదితరులకు సకాలంలో పింఛన్ల పంపిణీ చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. అయితే వలంటీర్లతో కాకుండా పంచాయతీ, సచివాలయ ఉద్యోగులతో పంపిణీ చేయించాలని ఎలక్షన్ కమిషన్ ఆదేశిస్తే... దానిని రాజకీయం చేస్తూ టీడీపీపై బురద చల్లుతూ మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబుపై విషప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలని అడ్డదారులు తొక్కుతున్నారని, ప్రజలు ముఖ్యమంత్రి జగన్ చెప్పే మాటలు నమ్మరన్నారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తేనే రాష్ట్రానికి భవిష్యత్తు ఉంది అని విశ్వసిస్తున్నారని అన్నారు. ఎప్పుడెప్పుడు అవినీతి, అక్రమ, అరాచక ప్రభుత్వాన్ని సాగనంపుదామని ఎదురు చూస్తున్నారని అన్నారు. నియోజకవర్గంలో టీడీపీ భారీ మెజారిటీతో విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

గుడిబండ: మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే రాష్ట్రం అన్నివిధాలా అభివృద్ధి చెందుతుందని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సునీల్‌కుమార్ పేర్కొన్నారు. ఆయన సోమవారం మండలంలోని మోరుబాగుల, కింగేపల్లి, ఎస్‌ఆర్‌పల్లి, కేబీఎస్‌పాళ్యం, గుడిబండ, గ్రామాల్లో ఎన్నికల ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. నాయకులు వివేక్ పాండురంగప్ప, సుధాకర్, ఎస్సీ రాయుడు, జయరామరెడ్డి, ఎం. నాగేంద్రప్ప, హనుమంతరాయప్ప తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలలో కార్పొరేట్ స్థాయి విద్య

ఎన్ఎస్‌పీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్

హిందూపురం అర్బన్, ఏప్రిల్ 1: విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు దిరునామా ఎన్ఎస్‌పీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల అని ప్రిన్సిపాల్ ప్రగతి పేర్కొన్నారు. తల్లిదండ్రులు మెచ్చేలా అన్ని సౌర్యాలు ఉన్నాయన్నారు. కళాశాలలో చదువు తున్న విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ వెంకటేష్, డిప్యూటీ వార్డెన్ సరస్వతి, అధ్యాపకులు శ్రీలక్ష్మి, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పురం ఎంపీ అభ్యర్థిగా షాహీన్

హిందూపురం అర్బన్, ఏప్రిల్ 1: కాంగ్రెస్ పార్టీ హిందూపురం పార్లమెంట్ అభ్యర్థిగా సమద్ షాహీన్ పే రు ఖరారు చేసినట్లు ఆ పార్టీ రాష్ట్ర జనరల్ సెక్రటరీ బాలాజీ మనోహర్ సోమవారం పేర్కొన్నారు. షాహీన్ కాంగ్రెస్ పార్టీలో సీనియర్ నాయకుడిగా కొనసాగారు. 2004, 2009లో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే టికెట్ కోసం ప్రయత్నాలు చేశారు. అప్పుడు టికెట్ దక్కలేదు. ఈ సారి ఎంపీ టికెట్ ఆయనకు దక్కింది. కాంగ్రెస్ పార్టీకి ఊపిరిగా ఆ కుటుంబం ఉందన్నారు. అందుకే ఎంపీ అభ్యర్థిగా ఎంపిక చేశారని తెలిపారు.

బీసీల కోసం పుట్టిందే టీడీపీ: నాయకులు



సమావేశంలో పాల్గొన్న టీడీపీ బీసీ సెల్ నాయకులు

హిందూపురం, ఏప్రిల్ 1: వెనుకబడిన తరగతుల ఆర్థిక, రాజకీయ, సాధికారత కోసం ఆవిర్భవించిందే తెలుగుదేశం పార్టీ అని, దానివెంట మనమే పుడు ఉండాలని తెలుగుదేశం పార్టీ బీసీసెల్ నాయకులు పేర్కొన్నారు. పట్టణంలోని కనకదాస కల్యాణమండపంలో సోమవారం కన్వీనర్ ఇన్‌చార్జ్ రామచంద్ర ఆధ్వర్యంలో జయహో బీసీ కార్యక్రమం నిర్వహించారు. దీనికి హిజ్రైన బీసీసెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జేవనహళ్లి ఆనంద్, మునిసిపల్ మాజీ చైర్మన్ అనిల్, బీగరసెల్ జిల్లా అధ్యక్షుడు అమర్నాథ్ మాట్లాడుతూ... తెలుగుదేశం పార్టీ బడుగు బలహీనవర్గాల అభ్యున్నతి కోసం పనిచేస్తుందన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక బీసీలపై దాడులు పెరిగాయన్నారు. కానీ ముఖ్యమంత్రి జగన్ మాత్రం నా బీసీ, నా ఎస్సీ అంటూ ప్రజలను మభ్య పెడుతున్నారన్నారు. దీనిని గుర్తించి బీసీలు టీడీపీ వైపు నిలవాలన్నారు. ముఖ్యంగా హిందూపురం నియోజకవర్గాన్ని ప్రశాంతంగా ఉంచే నాయకుడిని ఎన్నుకోవాలన్నారు. లేదంటే హింసా పురంగా మారుతుందన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీని తిరిగి పట్టం కట్టాలన్నారు. కార్యక్రమంలో బీసీసెల్ నాయకుడు నబీరసూల్, నవీన్, నాగేంద్ర, పరిమళ, విజయలక్ష్మి, జనసేన శేఖర్, మాదకర, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులతో వెట్టిచాకిరీ

మండిపడ్డ విద్యార్థి సంఘాల నాయకులు



నీళ్ల క్యాన్లను మోస్తున్న విద్యార్థులు

లేపాక్షి, ఏప్రిల్ 1: చదువుకోవాల్సిన విద్యార్థుల చేత పాఠశాల సిబ్బంది వెట్టిచాకిరీ చేయిస్తూ చదువుకు దూరం చేస్తున్నారని విద్యార్థి సంఘం నాయకులు మండిపడ్డారు. ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ నాయకులు సోమవారం స్థానిక మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో విద్యార్థుల సమస్యల ను తెలుసుకోవడానికి వెళ్లారు. అయితే వారు వెళ్లే సమయానికి విద్యార్థులు వాటర్‌క్యాన్లు మోసుకెళ్తుండటం గమనించి పాఠశాల సిబ్బందిని నిలదీ శారు. ఎన్నో ఆశలు పెట్టుకుని తల్లిదండ్రులు పాఠశాలకు పంపిస్తే వారిచేత వంటలు చేయించడం, నీళ్లక్యాన్లు మోయించడం ఏంటని ప్రశ్నించారు. గతం లో కూడా ఈ పాఠశాలపై పలు ఆరోపణలు వచ్చాయని, అయినా ప్రిన్సిపాల్ తీరులో మార్పు రాలేదన్నారు. ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా వారు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ నాయకుడు చంద్రశేఖర్‌రెడ్డి, ఎస్ఎఫ్ఐ నాయకుడు బాబావలి తదితరులు పేర్కొన్నారు. చర్యలు తీసుకోకపోతే పాఠశాల ఎదుట బైఠాయించి నిరసన వ్యక్తం చేస్తామని తెలిపారు.

పింఛన్ల పంపిణీకి ప్రత్యేక ఏర్పాట్లు : ఎంపీడీఓ

గోరంట్ల, ఏప్రిల్ 1: మండలంలో బుధవారం నుంచి గ్రామ సచివాలయాల ద్వారా పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీఓ ప్రవీణ్ తెలిపారు. ఆయన సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వ హించారు. ఈఓఆర్డీ సుధాకర్ పాల్గొన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు వెంటనే వలంటీర్ల వద్ద ఉన్న సెల్‌ఫోన్, డివైజులు, ఇతర రికార్డులు స్వాధీనం చేసుకోవాలని కార్యదర్శులకు ఆదేశించారు. పింఛన్ల పంపిణీని కార్యదర్శులు, సచి వాలయ సిబ్బంది సంయుక్తంగా పంపిణీచేసేలా ఉత్తర్వులు జారీ చేశామన్నారు. గ్రామాల్లోని రచ్చకట్టలు, ప్రధాన ప్రాంతాల్లో పింఛన్ల పంపిణీ చేపట్టాలన్నారు. పంచాయతీల్లో 69శాతం పన్నుల వసూలు చేశామని ఈఓఆర్డీ తెలిపారు. గోరంట్లలో టీడీపీ పార్టీల జెండాలు, ప్రచార సామాగ్రి కనిపిస్తుండడంతో సీ విజిల్ యాప్‌ద్వారా ఏడు ఫిర్యాదులు అందినట్లు ఎంపీడీఓ తెలిపారు. ఇకపై ప్రజల ఫిర్యాదులు అందకముందే చర్యలు తీసుకోవాలన్నారు. సచివాలయ వద్ద, గ్రామ ప్రధాన ప్రాంతాల్లో వదిలేయాలని ఏర్పాటు చేయాలన్నారు. ఈసమావేశంలో పంచాయతీ కార్యదర్శులున్నారు.

సామాన్యులకు అండగా 'సూపర్‌సిక్స్' : టీడీపీ



సూపర్‌సిక్స్ పథకాలపై ప్రచారంలో టీడీపీ నాయకులు

హిందూపురం, ఏప్రిల్ 1: తెలుగుదేశం పార్టీ ప్రవేశపెట్టిన సూపర్‌సిక్స్ పథకాలు సామాన్యులకు కొండంత అండగా నిలుస్తాయని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. వారు సోమవారం హిందూపురం మండలం జేవనపల్లిలో సూపర్‌సిక్స్ పథకాలపై ఇంటింటికి వెళ్లి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ అశ్వత్థనారాయణరెడ్డి, బీసీసెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జేవనహళ్లి ఆనంద్ నాయకులు హెచ్‌ఎన్‌రామ, నారాయణరెడ్డి, ఆదినారాయణ, గోపాలెడ్డి, రామకృష్ణ, చిన్నారెడ్డి, నాగరాజు, రామకృష్ణ, చిక్కీరప్ప, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుతో ప్రతి కుటుంబానికి పథకాలు



కనిశెట్టిపల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు

చిలమత్తూరు, ఏప్రిల్ 1: ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అంది, గ్రామాలు అభివృద్ధి బాటలో నడిపించాలంటే టీడీపీ అధినేత నారా చంద్రబాబుతోనే సాధ్యమని టీడీపీ మండల నాయకులు పేర్కొన్నారు. రాబోయే త్వరలో జరుగబోవు ఎన్నికల్లో టీడీపీని ఆదరించాలని ప్రజలను కోరారు. వారు సోమవారం మండలంలోని కనిశెట్టిపల్లిలో ఇంటింటి ప్రచారం చేపట్టారు. నాయకులు జేకరీ గంగాధర్, శ్రీదేవి, సూర్యనారాయణ, మీసేవ సూర్యనారాయణ, నాగార్జున, హోటల్ చంద్ర, నారాయణప్ప తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు చేపట్టండి

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి

పుట్టపర్తి, ఏప్రిల్ 1: వేసవిలో ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి.. జిల్లా అధికారులను ఆదేశించారు. అమరావతి నుంచి సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో సమీక్ష నిర్వహించారు. స్థానిక కలెక్టరేట్‌లోని వీడియోకాన్ఫరెన్స్ హాల్ నుంచి కలెక్టర్ అరుణ్‌బాబు ఇతర అధికారులు పాల్గొన్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ... ఎండతీవ్రత పెరిగిందని, వడగాలులపై ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. తాగునీరు, విద్యుత్ సరఫరాలో ఎక్కడ సమస్య తలెత్తినా వెంటనే పరిష్కార చర్యలు చేపట్టాలన్నారు. కూలీలకు ఉపాధిహామీ పనులు విస్తృతంగా కల్పించాలన్నారు. పింఛన్ల పంపిణీ సజావుగా చేపట్టాలన్నారు. జిల్లాలో తాగునీటి సరఫరాకు తీసుకుంటున్న చర్యలపై కలెక్టర్ వివరించారు. కార్యక్రమంలో జేసీ అభిషేక్ కుమార్, డీఆర్వో కొండయ్య, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, డ్వామా పీడీ విజయేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

అగళి: వేసవి ప్రారంభమైన నేపథ్యంలో మండల వ్యాప్తంగా గ్రామాల్లో నీటి ఎద్దడి తలెత్తకుండా గట్టి చర్యలు తీసుకోవాలని మండల ప్రత్యేక కాధికారి చంద్రశేఖర్ సూచించారు. ఆయన సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్, ఉపాధిహామీ పథకం, ట్రాన్స్‌కో తదితర శాఖల అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అగళి మండలం కర్ణాటక సరిహద్దులో ఉందన్నారు. మండలంలో ప్రజల సమస్యలపై అధికారులు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్ప వన్నారు. సమావేశంలో ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్, పరిపాలన అధికారి శ్రీనివాసరావు, ఏపీఓ శివన్న, ఈఓఆర్డీ పద్మ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడిపై దాడి

హిందూపురం, ఏప్రిల్ 1: పట్టణంలోని వాల్మీకి వీధికి చెందిన టీడీపీ నాయకుడు విజయ్‌కుమార్‌పై సోమవారం రాత్రి దాడి జరిగింది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వాల్మీకి వీధిలో వాహనం పార్కింగ్ విషయంలో కొన్ని రోజులుగా బాధిత కుటుంబానికి, అదే వీధిలో ఉన్న వైసీపీ సానుభూతి పరులు పార్వతి, సోదరి వలంటీర్ సంధ్య మధ్య మనస్పర్థలు ఉన్నాయి. స్థానిక కనకదాసు కల్యాణ మండపంలో సోమవారం జయహో బీసీ సదస్సు జరిగింది. ఇది విజయవంతం కావడంతో తాము సదరు గా మాట్లాడ కుంటుండగా వలంటీర్ భర్త రాజేష్‌తో పాటు దినేష్ చరణ్‌లు విజయ్‌కుమార్‌పై దాడి చేశారన్నారు. కర్రతో కొట్టడంతో తలకు బలమైన గాయాలు అయ్యాయని వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్సలు అందించామన్నారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడి కుటుంబ సభ్యులు తెలిపారు. ఇదిలా ఉంటే వలంటీర్ తరఫు వారు మహిళపై విజయ్ కుమార్ కుటుంబ సభ్యులు దాడి చేశారని టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

ఆక్రమణకు గురైన శ్మశాన వాటిక దారి

అధికారులు చర్యలు తీసుకోవాలి : టీడీపీ నాయకులు

పెనుకొండ, ఏప్రిల్ 1: పట్టణంలోని బోయపేటలోని రామస్వామి గుడి సమీపంలో ఉన్న హిందూ శ్మశానానికి వెళ్లే రహదారిని కొందరు ఆక్రమించుకుని నిర్మాణాలు చేపడుతున్నారని పెనుకొండ మాజీ సర్పంచ్ శ్రీనివాసులు, టీడీపీ నాయకుడు అనిల్‌కుమార్ అధికారులకు ఆరోపించారు. వాటిపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని వారు అధికారులకు విజ్ఞప్తి చేశారు. వారు సోమవారం విలేకరులతో మాట్లాడుతూ... రామస్వామి గుడి సమీపంలో సమీపంలో సర్వే నంబరు 222ఏ/2, 222బిలో ఎకరా భూమి మినహాయించి మిగిలిన తొమ్మిది ఎకరాల భూమి డైక్లాండ్ మేరకు గ్రామ కంఠం చింతతోపుగా ఉందన్నారు. ఈ భూమి ద్వారానే హిందువులు శ్మశానవాటికకు వెళ్లేందుకు రహదారి ఉందన్నారు. ప్రస్తుతం ఈ భూ మిని కొందరు ఆక్రమించి దుకాణాలు నిర్మిస్తూ శ్మశానవాటికకు కూడా దారిలేకుండా ఆక్రమ నిర్మాణాలు చేపడుతున్నారన్నారు. వీటిపై రెవెన్యూ, మునిసిపల్ అధికారులు వెంటనే స్పందించి విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు.



దారిని ఆక్రమించి భూమిని చదును చేస్తున్న దృశ్యం

బిల్లులు రాక ఆగిన తాగునీటి పథకం

- పెండింగ్ బిల్లులు చెల్లిస్తేనే పనులు పూర్తి అంటున్న కాంట్రాక్టర్లు
- మున్సిపాలిటీల పరిధిలో తీవ్రమవుతున్న తాగునీటి సమస్య



అర్ధంతరంగా ఆగిపోయిన ట్యాంకు నిర్మాణం

మడకశిర, ఏప్రిల్ 1: పట్టణాలకు ఫ్లోరైడ్ రహిత తాగునీటిని అందించేం దుకు చేపట్టిన తాగునీటి పథకం (కాంప్రహెన్సివ్ వాటర్‌సప్లయ్ ఇంప్రూవ్‌మెంట్ పథకం) పనులకు సంబంధించి బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. దీంతో సంవత్సరం పై బడి పనులు నిలిచిపోయాయి. బిల్లులు చెల్లిస్తేనే పనులు చేపడుతామని కాంట్రాక్టర్లు భీష్మించారు. రాయలసీమలోని కర్నూల్, అనంతపురం, కడప జిల్లాల్లోని 12 మున్సిపాల్టీలకు ఈ పథకం కింద కోట్లాది రూపాయలు మంజూరు చేశారు. అందులో అనంతపురం ఉమ్మడి జిల్లాగా ఉన్నప్పుడు ఐదు మున్సిపాల్టీలకు మంజూరయ్యాయి. ఇందులో అనంతపురం, కర్నూల్ జిల్లాల్లో ఇప్పటి వరకు 70 శాతం పనులే జరిగినట్లు అధికారుల సమాచారం. రాయలసీమలో 12 మున్సిపాల్టీలకు సంబంధించి చేసిన పనులకు రూ.40 కోట్లు దాకా బిల్లులు పెండింగ్‌లో ఉంది. అందులో ఉమ్మడి అనంతపురంలోని ఐదు మున్సిపాల్టీలో రూ.18 కోట్ల దాకా ఆదాల్సిఉంది. బిల్లులు అందక పనులు ఎక్కడికక్కడ పను లు నిలిచి పోయాయి. వేసవి వచ్చిందంటే పలు పట్టణాల్లో తాగునీటి సమస్య తీవ్రంగా నెలకొంటుంది. పలుమార్లు పట్టణ ప్రజలు తాగునీటి కోసం ఆందోళనలు చేసిన సందర్భాలు ఉన్నాయి. శ్రీసత్యసాయి జిల్లాలో పుట్టపర్తి, మడకశిర మున్సిపాల్టీలకు ఈ పథ కం కింద నిధులు మంజూరుకాగా... మడకశిర పట్టణానికి రూ. 63కోట్లు మంజూరయ్యాయి. ఏఐఐబీ (ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకు) ద్వారా 70 శాతం, ప్రభుత్వం నుంచి 30 శాతం నిధులతో పనులు చేపట్టారు. పట్టణ సమీపంలోని చెరువులో సంపు, ఏడు చోట్ల ట్యాంకుల నిర్మాణం చేపట్టారు. రెండేళ్లలో పనులు పూర్తి కావాల్సి ఉంది. సకాలంలో పూర్తికాకపోవడంతో మరో రెండేళ్లు పొడిగించినా ఇప్పటి వరకు 30 శాతం పనులే జరిగినట్లు అధికారుల సమాచారం. ఆ పనులు సంవత్సరంగా నిలిచిపోయాయి. పనులు వేగవంతమై పూర్తి అయితేనే పట్టణంలో శాశ్వతంగా తాగునీటి సమస్య పరిష్కారం కానుంది.

మడకశిరలో నిర్మాణాలు ఇలా...

నియోజకవర్గ కేంద్రమైన మడకశిర పట్టణంలోని చెరువులో సంపు, పక్కనే ఉన్న గుట్టపై వాటర్‌ప్లాంటు నిర్మించాల్సి ఉంది. ఆ ప్లాంటులో నీటిని శుద్ధిచేసి మెళవాయి వద్ద నిర్మించిన ట్యాంకుకు పైపుల ద్వారా నీటిని సరఫరా చేస్తారు. అక్కడి నుంచి పట్టణానికి రోజూ నీటిని అందించాలన్నది ఈ పథకం ఉద్దేశం. ఇందుకోసం పట్టణంలో ఏడు ట్యాంకులను నిర్మిస్తున్నారు. జూనియర్ కళాశాల ఆవరణలో ఏడు లక్షలలీటర్ల సామర్థ్యం ఉన్న ట్యాంకు, ఎస్సీ కాలనీలో ఎనిమిది లక్షలలీటర్లు, పావగడ రోడ్డు సమీపంలో ఆరు లక్షలలీటర్ల ట్యాంకుల నిర్మాణం చేపట్టారు. అలాగే బేగార్లపల్లి, మారుతీనగర్, గొల్లహట్టి, మల్లినాయకనపల్లిల్లో మూడు లక్షలలీటర్ల సామర్థ్యంగల ట్యాంకులను నిర్మిస్తున్నారు. మెళవాయి గుట్టపై ఉన్న ప్లాంటులో ఫిల్టర్ అయిన నీటిని పట్టణంలో నిర్మించిన ట్యాంకులకు సరఫరా చేసి, అక్కడి నుంచి ప్రతి ఇంటికి నీటిని అందించే విధంగా పనులు చేపట్టారు. మడకశిర పట్టణంలో ప్రస్తుతం 26 వేల జనాభా ఉంది. ఇక 30 సంవత్సరాల తరువాత కూడా జనాభా పెరిగినా నీటి సమస్య తలెత్తకుండా ఉండేవిధంగా ముందుజాగ్రత్తగా ట్యాంకుల నిర్మాణం చేపడుతున్నారు. ప్రస్తుతం ఉన్న జనాభా ప్రకారం ఈపథకం పూర్తయితే 40లక్షల లీటర్ల నీటిని సరఫరా చేస్తారు. అయితే ప్రస్తుతం చేపడుతున్న నిర్మాణాలు 50లక్షల లీటర్ల నీటిని సరఫరా చేసేవిధంగా పనులు జరుగుతున్నాయి. ప్రతి ఇంటికి కొళాయి ఏర్పాటుచేసి ప్రతి వ్యక్తికి 135 లీటర్ల నీటిని అందించనున్నట్లు అధికారుల సమాచారం. ఈ పథకం పనులు పూర్తయితే మడకశిర పట్టణంలో శాశ్వతంగా తాగునీటి సమస్య పరిష్కారం కానుంది.

తీవ్రమవుతున్న నీటి ఎద్దడి

తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా భూగర్భజలాలు అడుగంటి పోతుండడంతో బోర్లలో నీటి మట్టం తగ్గిపోతోంది. దీంతో పట్టణంలో తాగు నీటి సమస్య రోజురోజుకు తీవ్రమవుతుంది. పట్టణంలో పలు వార్డుల్లో తాగు నీటి సమస్య తీవ్రంగా ఉందని, సమస్య పరిష్కరించాలని ఆయా వార్డుల ప్రజలు ఆందోళనకు దిగుతున్నారు. పట్టణంలో తాగునీటి సమస్య పరిష్కరించడానికి చేపట్టిన తాగునీటి పథకం పనులు పూర్తి అయితే నీటి సమస్య పరిష్కారం అవుతుందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. సంబంధిత అధికారులు వేగవంతంగా పూర్తి చేసి తాగునీటి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

రూ. 18 కోట్ల దాకా చెల్లించాల్సి ఉంది

తాగునీటి పథకానికి సంబంధించి ఉమ్మడి అనంతపురం జిల్లాలోని ఐదు మున్సిపాల్టీలో చేపట్టిన పనులకు దాదాపు రూ.18 కోట్ల దాకా బిల్లులు చెల్లించాల్సింది. అయితే ఇప్పటి వరకు 30 శాతం పనులు పూర్తయ్యాయి. ఉమ్మడి జిల్లాగా ఉన్నప్పుడు అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాలోని హిందూపురం, మడకశిర, కళ్యాణదుర్గం, గుత్తి, పుట్టపర్తి మున్సిపాల్టీలకు రూ. 600 కోట్ల దాకా నిధులు మం జూరయ్యాయి. శాశ్వతంగా తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు కాంప్రహెన్సివ్ వాటర్‌సప్లయ్ ఇంప్రూవ్‌మెంట్ పథకం కింద నిధులు మంజూరు చేశారు.

- సతీష్ చంద్ర, ఈఈ, పబ్లిక్ హెల్త్ అండ్ మున్సిపాల్టీ ఇంజినీరింగ్ డిపార్ట్‌మెంట్